# పరిశుద్ధాత్మ

## (The Holy Spirit)

**పాఠ్యోద్దేశం**: పరిపక్వతచెంది ఉత్పత్తి చేయగల దేవుని రాజ్యాన్ని క్రీస్తునందు స్థాపించ టంలో మన రాజైన క్రీస్తుతో పరిశుద్ధాత్మ ఎట్లు సహకరించాడో చూపించుట.

### ఉపోద్ఘాతం

*అయితే నేను మీతో సత్యము చెప్పుచున్నాను, నేను వెళ్లిపోవుటవలన మీకు ప్రయోజన కరము నేను వెళ్లనియెడల ఆదరణ కర్త మీయొద్దకు రాడు నేను వెళ్లినయెడల ఆయనను మీయొద్దకు పంపుదును, ఆయన వచ్చి, పాపమును గూర్చియు నీతిని గూర్చియు తీర్పును గూర్చియు లోకమును ఒప్పుకొనజేయును. యోహాను 16:7,8*

తన మరణానికి ముందు యేసు, ఈ పైలేఖనాన్ని తన శిష్యులతో చెప్పాడు. తరుచుగా అపార్థం చేసు కొనబడిన దైవత్వంలోని ఈ వ్యక్తిని అనగా పరిశుద్ధాత్మను గూర్చియు, దేవుని యొక్క రాజ్యంలో మానవాళి కోసం నిర్ణయమైన దేవుని లక్ష్యాల్ని స్థాపించటంలోనూ, కొనసాగించటంలోనూ, మనరాజైన యేసుక్రీస్తులో ఆయన నిర్వహిం చిన పాత్రను గూర్చియు ఈ పాఠంలో మనం చదువు కొనబోవుచున్నాం. మన **రాజైన క్రీస్తుయొక్కప్రణాళికలు** పరిశుద్ధాత్ముని యొక్క పనితో సంపూర్ణ సమన్వయం ఎట్లు కలిగిఉండవలసి ఉందో మనం తెలుసుకుందాం. పరిశుద్ధాత్మనుగూర్చి మీరు దేవుని వాక్యము నుండి కొంత నేర్చుకొని ఉన్నారని తలంచుచున్నాము. తండ్రి, కుమారులు కలిగియున్న లక్షణాలనే కలిగిన వ్యక్తిగా ఆయనను మీరు అంగీకరించె దరని కూడ తలంచెదము.

నాలుగు ప్రత్యేక భాగములుగా వ్రాయబడిన ఈ పాఠపు మొదటి భాగంలో పరి శుద్ధాత్మ స్వభావమును గూర్చిన సాధారణ పరిచయము వ్రాయబడింది. పరిశుద్ధాత్మ బాప్తిస్మం పొందిన అపొస్తలులతో కలిసి ఆయన లోకంలో జరిగించిన సువార్త ప్రకటన కార్య క్రమములను రెండవ భాగం చూపుతుంది. మూడవభాగంలో, స్థానిక సంఘము లకు క్షేమాభివృద్ధి కలిగించుటకు సంఘ సభ్యులకు కొందరికి ఆత్మ సంబంధమైన వరములను పరిశుద్ధాత్మ ఎట్లు అనుగ్రహించాడో మనం చూస్తాము. చివరిభాగంలో గొప్పదైన దేవునిరాజ్యాన్ని దేవుని కుమారులుగ స్వతంత్రించు కొనుటకు ఆయన రాజ్య పౌరులు అర్హులు అగునట్లు పరిశుద్ధపరచబడు కార్యక్రమంలో యేసుతో పాటు పరిశుద్ధాత్మ ఎట్లు సహకరించుచున్నాడో చూపించెదము.

## ఒకటవ భాగము: పరిశుద్ధాత్మను గూర్చిన పరిచయము

## (Introduction to the Holy Spirit)

### పాఠము

*ఆదియందు దేవుడు భూమ్యాకాశములను సృజించెను. భూమి నిరాకారముగాను శూన్యముగాను ఉండెను చీకటి అగాధ జలము పైన కమ్మియుండెను దేవుని ఆత్మ జలములపైన అల్లాడుచుండెను. ఆది. 1:1,2*

మనం ప్రస్తుతం చూస్తున్న విశ్వం భౌతిక వాస్తవం అగునట్లు తన యొక్క వాక్కు ద్వారా దేవుడు భూమ్యాకాశములను సృజించినాడు. ఆదికాండము మొదటి అధ్యాయంలో సృష్టియావత్తు ఆరుదినాల్లో చేయబడినట్లు వ్రాయబడింది. "మన స్వరూప మందు మన పోలిక చొప్పన నరులను చేయుదము"ని దేవుడు ఆదికాండము 1:26లో చెప్పినందుకు ఆశ్చర్యపడము. ఎందు కంటే, "ఏలోహిమ్" అనే హెబ్రీ పదం దేవుడు అని తర్జుమా చేయబడినది. మరియు అది బహువచనాన్ని తెలుపుతుంది. "మన," "చేయుదము" అనే బహువచన సర్వనామ ప్రయోగములన ఒబట్టి, తండ్రియైన దేవుడు, అగాధ జలములపై అల్లాడుచున్న ఆత్మ, సమస్తము ఎవని యందు ఎవరి ద్వారా, ఎవరి కొరకు సృష్టింపబడినదో ఆ యేసుక్రీస్తు అను ముగ్గురినీ తెలియజేయ గలవని అనుకొనవచ్చును (కొలొస్స. 1:16). "దేవుని ఆత్మ నన్ను సృజించెను సర్వశక్తుని యొక్క శ్వాసము నాకు జీవమునిచ్చెను" అని యోబు చెప్పినప్పుడు పరిశుద్ధాత్మునికి సృష్టించగల శక్తి ఉందని సూచించుచున్నాడు (యోబు 33:4). యెషయా 48:16లో ప్రవక్తయైన యెషయా ప్రభువగు యెహోవా అనియు, ఆయన ఆత్మ అనియు చెప్పి విభజన గావించెను.

అపొస్తలుల కార్యములు 17:29 లో దేవత్వము అనేమాట 'థియోస్" అనే గ్రీకుపదం నుండి తర్జుమాచేయబడినది. అలాగే, రోమా. 1:20లో దేవత్వము అనేమాట, కొలొస్స. 2:9లోని దేవత్వము అనేమాటకు "థియోటన్" అనే గ్రీకు పదం నుండి తర్జుమాచేయబడినది. "దేవస్వభావం" అనే మాట కూడా కొన్నిచోట్ల తర్జుమా చేయబడినది. దేవత్వం లేక దేవత్వముగా గుర్తింపబడగలుగు **ముగ్గురు వేర్వేరు వ్యక్తులను** గుర్తించు అనేక వచనములు క్రొత్త నిబంధనలో ఉన్నాయి మత్తయి 28:19; రోమా. 15:30; మార్కు 1:9-11; యోహాను 15:26; 2 కొరింథీ. 13:14; 1 పేతురు 1:2లను చూడండి... ఈ లేఖనాల్ని, అలాగే మిగిలిన మరికొన్ని లేఖనాల్ని మనం చదివితే, తండ్రివలె కుమారునివలె పరిశుద్ధాత్మయు ఒక వ్యక్తియని గ్రహించగలము. ఉదాహ రణకు పరిశుద్ధాత్మ మనలను ప్రేమిస్తాడు. క్రైస్తవులమైన మనతో ఆయన సహవాసం చేస్తాడు.

మానవ చరిత్రలోని యుగములన్నిటా పరిశుద్ధాత్మ నిర్వహించిన ప్రధానపాత్ర ఏదో చెప్పటానికి ప్రయత్నించిన యెడల ఆయన మానవునికి సమాచారం ఇచ్చువాడుగా గోచరిస్తాడు. దేవుని

యొక్క ఆజ్ఞలను మానవులకు తెలియజేసి, వారికి ఆత్మ సంబంధమైన సమాచారమును ఆయన ఇచ్చియుండెను. "ఏలయనగా, ప్రవచనము ఎప్పుడును మనుష్యుని ఇచ్ఛను బట్టి కలుగ లేదుగాని మనుష్యులు పరిశుద్ధాత్మ వలన ప్రేరేపింపబడినవారై దేవుని మూలముగా పలికిరి" (2 పేతురు 1:21) అని పేతురు చెప్పాడు. అయిన ప్పటికీ, ఇదొక్కటే ఆయన పాత్రగాదు. కీర్తనల గ్రంథకర్త చెప్పియున్నట్టుగా పరిశుద్ధాత్మ సృష్టించగల శక్తిగలవాడే, ఆలాగుననే చెక్కడపు పనులు చేయుటకై బెసలేలుతో పనిచేసినట్లు మనం చూడగలం (కీర్తన. 104:30; నిర్గమ. 35:30,31) ప్రకృతి నియమములను గూర్చి పరిశుద్ధాత్మ సంపూర్ణ అవగాహన కలిగి వున్నాడు. ఏలయనగా ఆయన అనేకమైన అద్భుతములను చేసాడు. అద్భుతాలు ప్రకృతి నియమాలఫలితంలో మార్పును ఆదేశిస్తాయి.

యేసును కనే విషయంలో గర్భధారణ విధానంలో మరియ విషయంలో పరిశుద్ధాత్ముడు ప్రకృతి నియమాన్ని మార్పు చేయటం జరిగినది (మత్తయి 1:18; లూకా 1:35; ఫిలిప్పీ. 2:6,7). మరియ గర్భమందు యేసు పడటానికి పరిశుద్ధాత్మశక్తి హేతువైనప్పటికీ, ముప్పది సంవత్సరాల అనంతరం బాప్తిస్మమిచ్చు యోహాను ద్వారా యేసు బాప్తిస్మం పొందునంత వరకు యేసు, పరిశుద్ధాత్మ నేరుగా తారసిల్లిన సందర్భాలు లేవు (లూకా 3:21-23). పరిశుద్ధాత్ముడు చేసిన అద్భుతమే బాప్తిస్మమిచ్చు యోహాను యొక్క పుట్టుక. వాస్తవానికి యోహాను తన తల్లి గర్భములో ఉండినప్పుడే పరిశుద్ధాత్ముడు ఆయనతో ఉండెను (లూకా 1:15).

యేసు మరియు బాప్తిస్మమిచ్చుయోహానుల పుట్టుక పరిశుద్ధాత్మునియొక్క క్రియను చూపిస్తుంది. దేవుని రాజ్యముపై మనకు దైవికరాజును అనుగ్రహించటానికి దేవత్వములోని ఇతర వ్యక్తులతో ఆయన కలిసి పనిచేసినాడు. చరిత్రలో ఆ కాలమందు మానవ విశేషకమైన దేవుని రాజ్యం దుఃఖకరమైన పరిస్థితుల్లో ఉంది. దావీదు కుమారులలో ఒకరైనను భౌతిక ఇశ్రాయేలు జనాంగానికి రాజుగా లేరు. ఈ జనాంగాన్ని రోమీయులు పాలించారు. అయినప్పటికీ, వారి రాజైన యేసు తన సొంత ఉపదేశాల ద్వారాను, ఆయనకు ముందు మార్గం సరాళం చేసిన బాప్తిస్మమిచ్చు యోహాను ద్వారాను **మెస్సీయా** అని తనను తాను తెలియ జేసుకొనవలసి ఉంది (మత్తయి 11:1-14).

రాజైన యేసుకు ముందుగా వెళ్ళు బాప్తిస్మమిచ్చు యోహానును పరిశుద్ధాత్మ బాగుగా సిద్ధంచేసాడు. యోహాను ఇలా చెప్పాడు, "నేను క్రీస్తును కాను" మరలా, "ఆయన హెచ్చవలసి ఉన్నది నేను తగ్గవలసి వున్నది" (యోహాను 3:28-30) అని అన్నాడు. యేసు, యోహాను ఇరువురు దేవునిరాజ్యాన్ని ప్రకటించారు (మత్తయి 3:1; 4:17). పశ్చాత్తాప బాప్తిస్మమైన బాప్తిస్మమును యోహాను నీళ్లలో ఇచ్చాడు, కాని యేసు పరిశుద్ధాత్మతోను అగ్నితోను బాప్తిస్మమిచ్చాడు(మత్తయి 3:11). యేసు ఎవరిని పంపెనో వారు కూడా రాజ్యాన్ని ప్రకటించారు. దయ్యములను వెళ్లగొట్టారు. రోగులను స్వస్థపరచగల శక్తి కలిగిఉన్నారు. అయితే, యేసు తిరిగి పరలోకానికి వెళ్లక పూర్వం వీరిలో ఏ ఒక్కరూ పరిశుద్ధాత్మలో బాప్తిస్మం పొంది ఉండలేదు (అపో. కార్య. 1:5). ఈ పాఠం రెండవ భాగంలో ఈ అంశాన్ని మరలా చర్చిస్తాము.

ఏలయనగా, దేవుడు తాను పంపినవానికి కొలత లేకుండా ఆత్మను అను గ్రహించాడు గనుక ఆయన దేవునిమాటలే పలికాడు (యోహాను 3:34). "కొలత లేకుండా" అనుగ్రహింపబడిన పరిశుద్ధాత్మ తనమీదికి రానంత వరకూ యేసు అద్భుతా లను చేయలేదని గుర్తించుట ఆసక్తికరం. ప్రకృతి నియమాలతో పనిచేయటం పరిశుద్ధాత్ముని యొక్క పరిచర్య విభాగాల్లో ఓ విభాగం అని తెలిసికోవటం అత్యంత ముఖ్యం. ఇది కేవలం ఆలోచన మాత్రమే. ఈ ఆలోచనకు లేఖనాను సారమైన ఆధారం అంతగా లేకపోయినా, బాప్తిస్మం పొందినతరువాత యేసు చేసిన ప్రతీ అద్భుతంతో పరిశుద్ధాత్మకు సన్నిహిత సంబంధం ఉండినట్లుగానే జరిగినది.

1 తిమోతి. 3:16లో ఆత్మ విషయమున నీతిపరుడని తీర్పు పొందెనని వ్రాయబడినది. హెబ్రీ గ్రంథకర్త, "నిత్యుడగు ఆత్మద్వారా దేవునికి తన్నుతాను నిర్దోషునిగా అర్పించుకొనినవాడు యేసు అని చెప్పాడు (హెబ్రీ. 9:13,14). పరిశుద్ధాత్మ యేసు యొక్క మరణంలో మాత్రమే ఆయనతో ఉండలేదు అయితే, అపొస్తలుడైన పౌలు చెప్పినట్లు పరిశుద్ధాత్మ ఆయనను మృతులలో నుండి లేపాడు. తద్వారా ఆయన దేవుని కుమారుడుగా బయలుపరచబడినాడు (రోమా. 1:4). బయెల్జెబూలువలన దయ్యములను వెళ్లగొట్టుచున్నాడని శాస్త్రులు యేసును నిందించినప్పుడు ఆయన, వారితో ఇలా అన్నాడు.

> *సమస్త పాపములును మనుష్యులు చేయు దూషణలన్నియు వారికి క్షమింపబడును గాని పరిశుద్ధాత్మ విషయము దూషణ చేయువాడెప్పుడును క్షమాపణ పొందక నిత్యపాపము చేసినవాడై యుండునని మీతో నిశ్చయముగా చెప్పుచున్నానని. ఎందుకనగా ఆయన అపవిత్రాత్మ పట్టినవాడని వారు చెప్పిరి.*
>
> *మార్కు 3:28-30*

యేసును ప్రజలు తిరస్కరించటం ఆయన అంగీకరించగలడు. అంతేకాదు వారు మారు మనస్సు పొందినప్పుడు వారిని క్షమించగలడు. కానీ, పరిశుద్ధాత్ముని క్రియలను సాతానుకుగాని, దయ్యాలకుగాని ఆపాదించటం ఎవరూ చేయకూడని పని. తన యొక్క నలుబది దినముల ఉపవాసకాలంలో పరిశుద్ధాత్మ, యేసును అరణ్యంలో నడిపించినాడు, యేసు నేరుగా సాతానును తరిమివేసిన మొదటి సందర్భ మిదే . అయితే, ఇదే ఆఖరిది కానందున మనకు ఆనందం (లూకా 4:1-13). తన భూలోక పరిచర్యలో యేసు పరిశుద్ధాత్మ శక్తి ద్వారా దయ్యములను వెళ్లగొట్టినాడు (మత్తయి 12:28).

తన సొంతపట్టణంలో సమాజ మందిరంలో యేసు యెషయా గ్రంథం చదివినప్పుడు యెషయా ప్రవచించి యుండినట్లుగానే పరిశుద్ధాత్మ తన మీద ఉండెనని యేసు చెప్పాడు

"ఆయన, నేడే మీ వినికిడిలో ఈ లేఖనము నెరవేరినదని వారితో చెప్పసాగెను" (లూకా 4:16-22). యేసు పరలోకానికి తిరిగివెళ్ళి అపొస్తలులకు పరిశుద్ధాత్మ బాప్తిస్మమిచ్చినాడు. ఒక సందర్భంలో పేతురు ఇలా అన్నాడు. అదేదనగా దేవుడు నజరేయుడైన యేసును పరిశుద్ధాత్మ తోను శక్తితోను అభిషేకించెననునదియే, దేవుడాయనకు తోడైయుండెను గనుక ఆయన మేలుచేయుచు, అపవాదిచేత పీడింప బడిన వారినందరిని స్వస్థపరచుచు సంచరించుచుండెను అపొ. కార్య. 10:38.

పరిశుద్ధాత్ముడు, దేవత్వంలోని మిగిలిన ఇద్దరితో పాటు ఒక వ్యక్తిగా ఈ లోకాన్ని, అందలి సమస్తాన్ని సృష్టించాడని మనం నిర్ధారించవచ్చు. జ్ఞానంలో, చేతి పనులలో, నాయకత్వంలో మనుష్యులకు సహాయంచేసి, పరలోకసంబంధమైన సమాచారాన్ని మానవులకు అనుగ్రహించుట వలన దేవుని రాజ్యంలో యెహోవాకు సహాయం చేసాడు. అంతేకాదు దేవుని కుమారుడు మనుష్య కుమారుడుగా మారుటలో సహాయంచేసి, దేవునిరాజ్యంపై యేసు పరిపాలన స్థాపించునట్లు యేసుప్రణాళికల్లో సహకరించాడు. లోకంలో దేవుని వాక్యాన్ని బోధించటంలోను, దయ్యాల్ని వెళ్లగొట్టటంలోను రోగులను స్వస్థపరచుటలోను యేసుకు సహాయం చేసాడు. యేసుయొక్క భౌతిక మరణంలోను, పునరుత్థానంలోను ఉండినవాడై తండ్రియొక్క కుడిపార్శ్వమున రాజుగా తన సింహాసనం మీద కూర్చుండిన యేసుకు ఇంకను సహాయం చేస్తున్నాడు. (అపొ. కార్య. 7:56). లోకంలో ఉండగా యేసు "కొలతలేకుండా" ఆత్మను పొందినాడు. మన ఈ పాఠపు తరువాతి భాగంలో అపొస్తలులు పరిశుద్ధాత్మ బాప్తిస్మం ఎలా పొందారో ఇతరులు కొందరు కృపావరములను ఎట్లు పొందిరో, విశ్వాసులైన క్రైస్తవులు తమ దేహములలో ఆయన యొక్క సన్నిధిని ఎట్లు అనుభవింతురో చూచెదము.

## చర్చ కోసం ప్రశ్నలు

1. యేసు రాజుగా పాలించవలసిన మానవ విశేషకమైన దేవుని రాజ్యం యేసు పరలోకం వెళ్ళిన తరువాత ఎవరి కార్యక్రమాల ద్వారా స్థాపించబడినది?
2. ఆదికాండం. 1:26లో దేవుడు ప్రయోగించిన బహువచన రూపంలోవున్న సర్వనామముల భావమేమి?
3. దేవత్వము లేక దైవత్వము అను మాటతో గుర్తింపబడిన ముగ్గురు వ్యక్తులు ఎవరు? ముగ్గురినీ ప్రస్తావించిన ఒక వచనమిమ్ము ?
4. బైబిలు గ్రంథం సంపూర్ణంగా వ్రాయబడక పూర్వం మానవాళికి సంబంధించి పరిశుద్ధాత్ముని యొక్క ప్రధాన పాత్ర ఏదని అగుపిస్తుంది ?
5. పరిశుద్ధాత్ముని యొక్క ఇతర కార్యములు ఏవి?
6. బాప్తిస్మమిచ్చు యోహాను పరిచర్యలో పరిశుద్ధాత్మ అతనిని ఏ విషయమందు బాగుగా సిద్ధంచేసాడు?
7. యేసు యెడల పరిశుద్ధాత్మ సహకారం ఎట్టి కొలతతో ఉండినది? దయచేసి, నీ జవాబు కొరకు ఒక వచనమిమ్ము.
8. క్రీస్తు జీవితంలో కష్టకాలములందు పరిశుద్ధాత్మ పాలుపుచ్చుకొనిన కొన్నింటిని వరుసగా వ్రాయండి ?
9. క్షమింపబడని పాపమును గూర్చి యేసు చెప్పటానికి శాస్త్రులు ఏమి చెప్పినారు?
10. ఈ పాఠంలో చెప్పబడిన సమాచారం నుండి పరిశుద్ధాత్మను గూర్చి ఒక సంక్షిప్త వివరణ ఇవ్వండి?

# రెండవ భాగము: పరిశుద్ధాత్మ బాప్తిస్మం

## (The Baptism of the Holy Spirit)

### ఉపోద్ఘాతం

*కాగా ఆయన దేవుని కుడిపార్శ్వమునకు హెచ్చింపబడి, పరిశుద్ధాత్మను గూర్చిన వాగ్దానమును తండ్రివలన పొంది, మీరు చూచుచు వినుచునున్న దీనిని కుమ్మరించి యున్నాడు.*

*అపొ. కార్య. 2:33*

పరిశుద్ధాత్మలోను, అగ్నిలోను బాప్తిస్మమిచ్చునని యేసునుగూర్చి బాప్తిస్మమిచ్చు యోహాను చెప్పాడు (మత్తయి 3:11). దేవుని రాజ్యంపై యేసు రాజుగా తండ్రికుడి పార్శ్వమున ఆసీనుడు కానంత వరకూ ఇది సంభవించలేదు. పునరుత్థానుడైన పిదప క్రీస్తు భూమిపై సంచరించిన నలుబది దినాలలో ఒక సందర్భమందు, "ఇక కొద్ది దినములలోగా మీరు పరిశుద్ధాత్మలో బాప్తిస్మము పొందెదర"ని అపొస్తలులతో చెప్పాడు, (అపొ. కార్య. 1:5). ఇది జరిగిన తరువాత వచ్చిన పెంతెకొస్తు దినమున అపొస్తలులు పరిశుద్ధాత్మ బాప్తిస్మం అనుకొలత పొందారు. (అపొ.కార్య. 2:1-4).

కొర్నేలి ఇంటివారికి పేతురు దేవునివాక్యం బోధిస్తూవుండగా, మొదటిగా మార్పు చెందిన అన్యజనులలోని క్రైస్తవులు కూడా పరిశుద్ధాత్మలో బాప్తిస్మం పొందారని కొందరు నిర్ధారించటం జరిగింది. ఎందుకంటే, పేతురు "నేను మాటలాడనారంభించినప్పుడు పరిశుద్ధాత్మ మొదట మన మీదికి దిగిన ప్రకారం వారి మీదికిని దిగెను." అనిచెప్పాడు. అతడు ఇంకనూ మాట్లాడుచు, "యోహాను నీళ్లలో బాప్తిస్మమిచ్చెనుగాని కొద్ది దినముల లోగా మీరు పరిశుద్ధాత్మలో బాప్తిస్మం పొందెదరని ప్రభువు చెప్పినమాట జ్ఞాపకము చేసికొంటిని," అనికూడా చెప్పాడుగదా! (అపొ. కార్య. 11:15, 16). అన్యజనులు పరిశుద్ధాత్మలో బాప్తిస్మం పొందెనని పేతురు చెప్పుతున్నాడా? లేక పరిశుద్ధాత్మ అన్యజనుల మీదికి దిగుట అతడు చూచినప్పుడు ఆరంభంలో అపొస్తలుల మీదికి దిగినట్లు దిగెనని భావించి, అందువలన పరిశుద్ధాత్మలో కొందరు బాప్తిస్మం పొందెదరని యేసు చెప్పిన సంగతిని అతడు జ్ఞాపకం చేసుకొన్నాడా?

కొర్నేలి, అతని ఇంటి వారు మరియు అపొస్తలులు కలిగి ఉన్న శక్తులలో ఎంతో వ్యత్యాసముంది. అందువల్ల అపొస్తలులు మాత్రమే పరిశుద్ధాత్మ బాప్తిస్మం పొంది రనియు. అన్యజనులు ఈ సందర్భమున కేవలం ప్రత్యేక వరమును మాత్రమే పొందిరని నిర్ధారింపవచ్చును. మొదటి శతాబ్దంలో భూమి మీద జీవించుచుండిన మనుష్యులలో దేవుని రాజ్య పరిపాలనను జరిగించుటలో పరిశుద్ధాత్మ యేసుతో సహకరించిన పాత్రను అర్థం చేసుకోవటం ఈ పాఠంలో మన ప్రధానాసక్తి. తత్ఫలితంగా, పరిశుద్ధాత్మనుగూర్చిన మన పఠనంలో "ప్రక్కమార్గములలో" పరుగెత్తగోరము.

అపొస్తలుల కార్యములో వ్రాయబడిన సమాచారాన్నిబట్టి యేసు పరలోకమునకు తిరిగివెళ్లి పరిశుద్ధాత్మ చేత అపొస్తలులకు బాప్తిస్మమిచ్చిన తరువాత **అద్భుతమైన, విజయ వంతమైన సువార్త కార్యక్రమము** జరిగించెనని నిర్ధారణ చేయవచ్చు. పెంతెకొస్తు పండుగ రోజున యూదులు. యూద మతప్రవిష్టులు ఇంచు మించు 3000 మంది బాప్తిస్మం పొందారు. ఆ మీదట కొద్ది దినాలకే ఈసంఖ్య 5000 మంది పురుషులకు పెరిగింది. (అపొ. కార్య. 2:41, 4:4). దీనితరువాత పురుషులును, స్త్రీలును అనేకులు మరి ఎక్కువగా విశ్వాసులై ప్రభువు పక్షమున చేర్చబడ్డారు. శిష్యుల సంఖ్య విస్తరించుచున్నదని అపొస్తలుల కార్యముల రచయిత అయిన లూకా చెప్పుచున్నాడు. యాజకులలో అనేకులు విశ్వాసమునకు లోబడిరి (అపొ. కార్య. 5:14; 6:1; 6:7) దేవుని రాజ్య సందేశాన్ని, యేసుక్రీస్తు నామమును సమరయులు విని పురుషులును, స్త్రీలును బాప్తిస్మం పొందారు (అపొ. కార్య. 8:12). లుద్దలోను, షారోనులోను కాపురమున్న వారందరూ ప్రభువుతట్టు తిరిగారు (అపొ. కార్య. 9:35). యూదయ, సమరయ, గలిలయ దేశములయందంతటా క్షేమాభివృద్ధినొందుచు సంఘము విస్తరించినది (అపొ. కార్య. 9:31). అన్యజనులకును దేవుడు జీవార్థమైన మారుమనస్సు దయచేసి నాడు (అపొ. కార్య. 11:18). తత్ఫలితంగా, అంతియొకయలో అనేకులు ప్రభువుతట్టు తిరుగునంత వరకూ విజయవంతమైన ఈ సువార్త కార్యక్రమము కొనసాగినది (అపొ. కార్య. 11:21; 14:21). ఆసియాలో పలు తావులందు ప్రజలు దేవుని రాజ్య పౌరులు అయ్యారు.

మనకాలంలో సంఘసభ్యులను ఎక్కువగా సువార్త సేవా కార్యక్రమములందు చురుకుగా పాల్గొనేటట్లు చేయటానికి ప్రసంగవేదిక బోధకులు అపొస్తలులకార్యముల గ్రంథంలో పైవిధంగా తెలుపబడిన ఈ సంఖ్యలను ఉపయోగించుట అసామాన్య విషయం కాదు. అయినప్పటికీ, పరిశుద్ధాత్మలో పొందిన బాప్తిస్మం లేకుండా మన కాలంలో విజయవంతమైన ఈ కథ సంభవించు నంటే సందేహమే అయితే, ప్రపంచ వ్యాప్తంగా అదే సమయాన మనం నేడు కలిగిఉన్న దేవుని వాక్యశక్తితో ప్రజలను ప్రభువుతట్టు త్రిప్పగలం.

పరలోకం నుండి నడిపింపబడి, పరిశుద్ధాత్మ శక్తి భరితమై, అపొస్తలులచేత ప్రకటింపబడిన దైవికమైన నూతన రాజు యొక్క సువార్త సేవాకార్యక్రమం అంత విజయవంతమౌటకు కారణమేమి? "పైనుండి శక్తి పొందు వరకూ పట్టణంలో నిలిచి యుండుడని" యేసు తన శిష్యులతో చెప్పుటయు, వారట్లే చేయటయు మనకు గుర్తుంది (లూకా 24:49). వారు పొందిన ఒకశక్తి **లేఖనాల్ని అర్థంచేసుకొనే సామర్థ్యమై** వుంది. పరిశుద్ధాత్మ బాప్తిస్మం పొందకపూర్వం యేసు వారి మనస్సులను తెరిచాడు (లూకా 24:49). పరిశుద్ధాత్మ బాప్తిస్మం పొందిన తరువాత దేవునిరాజ్యాన్ని వారు మొదటిసారిగా పూర్ణంగా అర్థం చేసుకొని, పరలోక సంబంధమైన ఆత్మీయ రాజ్యంలో వారెట్లు దేవుని కుమారులై యున్నారో తెలిసికోగలిగారు. రాజుగా, యాజకునిగా, బలిగా యేసుయొక్క పాత్రను వారు అర్థం

చేసుకొన్నారు (హెబ్రీ. 5:8-10 ; 7:26,27 ; 8:1). ఈ విషయాలన్నింటినీ యేసు వారికి జాగ్రత్తగా వివరించినా, వారి మనస్సులను పూర్ణంగా తెరవటానికి పరిశుద్ధాత్మ బాప్తిస్మం అను కొలత అవసరమయింది.

ఫలితంగా, అంతకు పూర్వం వారు కొంతవరకూ ఎరిగిన సంగతుల్ని సంపూర్ణంగా గ్రహించగలిగారు. ఈ క్రొత్త అవగాహనే వారి విశ్వాసానికి ఆధారమయినది. తత్ఫలితంగా, **వారి శీలం బలపరచబడింది.** అపొస్తలులు **ధైర్యవంతులయ్యారు.** ముందరి పాఠాల్లో ఒక పాఠంలో సూచించినట్లుగా, పరిశుద్ధాత్మ బాప్తిస్మం పొందని పేతురుకు, పొందిన పేతురుకూ ఎంతో తేడా వుంది. యేసు బంధింపబడిన ప్రాతఃకాలంలో పేతురు కనుబరచిన ప్రవర్తనకూ పెంతెకొస్తు దినము తరువాత అధికారములోఉన్న అదే ప్రజల ముందు అతడు కనుబరచిన ధైర్యమునకు ఎంతో వ్యత్యాసమున్నది. భౌతికమరణ మంటే పేతురుకిక భయంలేదు ఎందుకంటే, పునరుత్థానశక్తి అతనికి అర్థమైనది (యోహాను 18:15-27; అపొ. కార్య.4:19,20).

*వారు పేతురు యోహానుల ధైర్యమును చూచినప్పుడు వారు విద్యలేని పామరులని గ్రహించి ఆశ్చర్యపడి, వారు యేసుతోకూడ ఉండినవారని గుర్తెరిగిరి. అపొ. 4:13.*

పైన ఉదాహరించినలాంటి సంఘటనల విషయంలో చింతించవలదని యేసు తన శిష్యులకు చెప్పాడు ఏలయనగా, యేసు "మీరేమి చెప్పవలసినదియు పరిశుద్ధాత్మ ఆ గడియలోనే మీకు నేర్పునని." (లూకా 12:12). అలాగే, ".... పరి శుద్ధాత్మ సమస్తమును మీకు బోధించి, నేను మీతోచెప్పిన సంగతులన్నింటినీ మీకు జ్ఞాపకం చేయును" అని కూడా ఆయన చెప్పాడు (యోహాను 14:26) మరలా ఆయన ఇట్లు చెప్పెను, "ఆయన నన్ను గూర్చి సాక్ష్యమిచ్చును." (యోహాను 15:26). పరిశుద్ధాత్మ సహాయాన్ని అపొస్తలులు అనుభవించక పూర్వం యేసు, "కొంచెము కాలమైన తరువాత మీరిక నన్ను చూడరు మరికొంచెము కాలమునకు నన్ను చూచెదరని" చెప్పి వారిని తబ్బిబ్బు గావించినాడు. కావునవారు, "కొంచెము కాలమని ఆయన చెప్పు చున్నదేమిటి? ఆయన చెప్పుచున్న సంగతి మనకు తెలియదని చెప్పుకొనిరి?" (యోహాను 16:16, 18). అయినప్పటికీ, పరిశుద్ధాత్మ ద్వారా వారు శక్తిపొందినప్పుడు యేసునుగూర్చి, ఆయన రాజ్యాన్ని గూర్చి అన్నిసంగతులు వివరించగలిగారు.

అపొస్తలుల కార్యములలో పరిశుద్ధాత్మ మరియు అపొస్తలులయొక్క పనిలో మనము పూర్తిగా మునిగిపోయి మనరాజైన యేసును చూడలేకపోవుట చాల సులభం. కానీ, అపొస్తలులు పొందిన ప్రతి దానికి యేసే ఆధారమని మనం జ్ఞాపకముంచు కోవాలి.

*అయితే ఆయన, అనగా సత్యస్వరూపియైన ఆత్మ వచ్చినప్పుడు మిమ్మును సర్వ సత్యములోనికి నడిపించును ఆయన తనంతట తానే యేమియు బోధింపక, వేటిని వినునో వాటిని బోధించి సంభవింపబోవు సంగతులను మీకు తెలియజేయును. యోహాను 16:13*

లోకంలో ఏది జరగాలని యేసు కోరాడో దానినే ఆయన పరిశుద్ధాత్మ నడిపింపులో జరిగించాడని మనకు నిశ్చయంగా తెలుసు. ఉదాహరణకు, యేసు పాపాన్ని గూర్చి నీతిని గూర్చి, తీర్పునుగూర్చి లోకాన్ని ఒప్పించాలని కోరినాడు. అందుకే ఆయన పరిశుద్ధాత్మ పనులనుగూర్చి మాట్లాడుచూ, "ఆయన వచ్చి పాపమునుగూర్చియు, నీతినిగూర్చియు, తీర్పునుగూర్చియు లోకమును ఒప్పుకొనజేయును" అని చెప్పెను. (యోహాను 16:8). **దేవుని రాజ్య సువార్త సందేశంలో లోకాన్ని ఒప్పింపచేయగల శక్తివుంది.** అయితే, దేవునిరాజ్య సువార్త అర్థవంతమైన రీతిలో ప్రకటింపబడాలి. "పైనుండి శక్తిని పొందినప్పుడు అపొస్తలులు సువార్తను అర్థము చేసుకొను శక్తిని పొందారు. అయిననూ, వారిపనిలో వారికి సహకారంగా ఉండటానికి మరి కొన్ని శక్తులు కూడా వారికియ్యబడ్డాయి.

వారిలో ఒక్కొక్కరి మీద వ్రాలిన అగ్నిజ్వాలల వంటి విభాగింపబడిన నాలుకలు పరిశుద్ధాత్మలో బాప్తిస్మం పొందెదరని బాప్తిస్మమిచ్చు యోహాను చెప్పిన సందేశ సత్యాన్ని గూర్చి నిస్సందేహంగా అపొస్తలులను ఒప్పించినవి. పరిశుద్ధాత్మలోను, అగ్నిలోనువారు బాప్తిస్మం పొందెదరని అతడు చెప్పెను. బలమైన గాలివంటి ఒకధ్వనితోకలిసి పరిశుద్ధాత్మ సన్నిధి బయలుపరచబడినది. వినువారిని ప్రోగుచేయు శక్తిగా ఆ ధ్వని పని చేసింది. అపొస్తలుల పరిచర్యలో ప్రయోజనకరమైన భాగం అయిన మరియొక శక్తి భాషలలో వారు మాట్లాడగలిగిన శక్తి (అపొ. కార్య. 2:1-6). పాఠశాలలో చేరి భాష నేర్చుకోవలసిన అవసరత నుండి ఆదికాలపు సువార్తికులు, ఉపదేశకులు తప్పింపబడ్డారు. అలాగే, **భాషలలోమాట్లాడుట** అనేది అవిశ్వాసుల కోసం దేవుని సన్నిధికి సూచనగా పనిచేసింది. అపొస్తలులు ప్రకటించిన సందేశం దేవునిచే ఆమోదింపబడిన దని నమ్మటం వారికి సులభతరమైంది (1 కొరింథీ 14:22).

ఆత్మలో మునిగిపోయిన ఈ అపొస్తలులు రోగగ్రస్తులైన వారిని బాగుచేయటానికీ, ఆరోగ్యంగా ఉన్న కొందరిని రోగులుగా చేయటానికీ శక్తికలిగి ఉండిరి. ఉదాహరణకు, పుట్టినప్పటి నుండి కుంటివాడైన ఒకనిని పేతురు స్వస్థపరిచాడు పౌలు ఎలుమ అనే వాడ్ని గ్రుడ్డివానిగా మొత్తాడు (అపొ. కార్య. 3:6; 13:9-11). పౌలు తాకిన చేతిగుడ్డలు, నడికట్లు రోగులదగ్గరకు కొనిపోబడినప్పుడు రోగులు స్వస్థతపొందారు ఇతరులు పేతురు వచ్చుచుండగా త్రోవప్రక్కన రోగులనుంచి తన నీడపడవలెనని ప్రయాసపడేవారు (అపొ. కార్య. 5:16,17; 19:11,12). ప్రసంగీకునిపాఠం జరుగుచుండగా నిద్రాభారమున జోగి క్రిందపడి మరణించినవానిని లేపినారు. ఉదాహరణకు, పౌలు ప్రసంగించుచుండగా మూడవఅంతస్తు నుండి క్రిందపడి ఐతుకు మరణించగా అతనిని పౌలు బ్రతికించినాడు. తమ చందావిషయంలో అబద్ధమాడిన సంఘసభ్యులు మరణిం చారు. ఉదాహరణకు, పేతురు ఎదుట అననీయ, సప్పీరాలు తాము అమ్మిన వెల విషయంలో పరిశు

ద్ధాత్మకు వ్యతిరేకంగా అబద్ధమాడినపుడు మరణించారు (అపొ.కార్య. 5:1-10; 20:9). పరిశుద్ధాత్మ బాప్తిస్మం పొందుటవలన ఈ పైవాటిని అపొస్తలులు చేయ సమర్థులై ఉండిరి.

పన్నెండుమంది అపొస్తలులలో ఒకడు కానప్పటికీ, వారికివలె తనకును అట్టి శక్తిగలదని పౌలు వాదించినాడు. అతడు పెంతెకొస్తునాడు పరిశుద్ధాత్మబాప్తిస్మం పొందిన 12 మందిలో ఒకడు కాడు. (1 కొరింథీ. 9:5; అపొ. కార్య. 1:21,22). ఆత్మసం బంధమైన వరములు పొందినవారి ద్వారా చేయబడిన అద్భుతములను పరిశోధన చేయుట వలన పరిశుద్ధాత్మ బాప్తిస్మం పొందినవారు చేసిన అవే అద్భుతాలను కొన్నింటిని క్రైస్తవులు చేయగలశక్తిగలవారని అగుపిస్తుంది. అపొస్తలులు మాత్రమే కలిగి ఉండిన ఒక శక్తి ఏదనగా హస్తనిక్షేపణద్వారా ఆదికాలపు క్రైస్తవులకు ఆత్మసంబంధ మైన వరము లను అనుగ్రహించగలుగుటయే, ఈవరములు అపొస్తలులద్వారా పొందినవారు కొన్ని అద్భుతములను చేయగలిగిరి. అద్భుతములు చేయబడురీతిలో పరిశుద్ధాత్మను పొందు టకు సమరయలోని కొందరు విశ్వాసుల యొద్దకు వెళ్లి హస్తనిక్షేపణ చేయునట్లు పేతురు, యోహానులు యెరూష లేము నుండి సమరయ ప్రయాణించివెళ్లినందున ఇట్లు ఊహించి చెప్ప వచ్చును (అపొ. కార్య. 8:14,15). పెద్దలు హస్తనిక్షేపణము చేయగా ప్రవచనమూలమున తిమోతీకి వరం అనుగ్రహింపబడింది (1 తిమోతి. 4:14).

అపొస్తలుల కార్యములు మరియు పత్రికలు సంపూర్ణముగా చదివినయెడల **సంఘముపై అపొస్తలులు కొంత కాలం అధికారం కలిగి ఉండిరని బోధపడుతుంది** 1 థెస్స. 2:6లోను, 2 కొరింథీ. 13:1,2 లోను వ్రాయబడినట్లు అపొస్తలుల ద్వారా మొదట కనుపరచబడిన శక్తి, మొదటి శతాబ్దములో మనరాజైన యేసుక్రీస్తు, తన రాజ్యం కోసం అనేకులైన పౌరులను సంపాదించగలిగింది. ఈ అధికారం ఈ శక్తి వారు పరిశుద్ధాత్మ బాప్తిస్మం ద్వారా పొందిన ఫలితమే.

మొదటి శతాబ్దమందలి సువార్తీకరణ దండయాత్ర చాలా విజయవంతముగా ఉండెను గనుక మనం ఇలా అడుగవచ్చు, సంఘ నాయకుల నుండి పరిశుద్ధాత్మ యొక్క బాప్తిస్మపు శక్తిని మన రాజు ఎందుకు తొలగించెను? మన పరిచర్యను జరిగించ డానికి పరిశుద్ధాత్మ యొక్క ఆ గొప్ప శక్తులను కలిగియుండుట ఉపయోగకరమైనదిగా కనబడవచ్చు. దేవుని రాజ్యమును గూర్చిన పూర్తి అవగాహనతో ప్రకటించి బోధించే సామర్థ్యత మరియు శక్తి; వివిధ ప్రాంతాల శ్రోతల యొక్క భాషను మాట్లాడుట; రోగులను స్వస్థపరచుట; చనిపోయిన వారిని లేపుట; వినువారిని ఆటంకపరచు గుడ్డి వారిని ఎదుర్కొనుట; దురాత్మలను వెళ్లగొట్టుట; విషకరమైన పాముల నుండి మరియు కీడైన వాటి నుండి విడుదలను ఆనందించుట అనేది దేవుని కొరకు సంఘములను కట్టుటకై యేసుకు సహకరించడముగా ఒక గొప్ప ప్రయాసమైయున్నది. ఒక పట్టణంలో విజయ వంతమైన సువార్తీకరణ తరువాత సంఘ పరిపక్వత నిమిత్తము కొంత మంది సంఘ సభ్యులకు పరిశుద్ధాత్మ నుండి వరములను అనుగ్రహించటానికి అపొస్తలులు అధికారమును కలిగియుండిరి (1 కొరింథీ. 12:27, 28; 2 కొరింథీ. 12:12).

దేవునిరాజ్యాన్ని గూర్చి సంపూర్ణ అవగాహన కలిగి ప్రకటన, బోధ చేయుటకు ఎవరుచేరినా వారిభాషలో మాట్లాడుటకు, రోగులను స్వస్థపరుచుటకును, చనిపోయిన వారిని లేపుటకు వినువారిని- ఆటంకపరుచుచున్న వారిని -గ్రుడ్డివారిగా -మొత్తుటకు, అపవిత్రాత్మలను వెళ్లగొట్టుటకు, విషసర్పముల కోరల నుండి ప్రమాదమును పొంద కుండుటకు, కొందరు సంఘసభ్యులు అద్భుతములనుచేయునట్లు వరములు అను గ్రహించటం మానవజ్ఞానము ప్రకారం బాగుంటుంది అనిపిస్తుంది. తత్ఫలితంగా, చాలమంది **పెంతెకొస్తు నాయకులు** యేసు తన ఆరంభ విధానాన్ని మార్చలేదని నమ్ముతున్నారు. వీరి వాదనను నిరూపించమని లోకం ఎదురు చూస్తున్నది. కాని, ఈ విధమైన సువార్త కార్యక్రమం సంఘం సంపూర్ణంగా స్థాపింపబడి తిరిగి తనంతట తాను ప్రపంచమంతటా ఉత్పత్తి చేయగలిగినదైన పిమ్మట మనరాజు ఈ విధానమును కోరుటలేదు. మనము ఈ నిర్ణయానికి రావలసి ఉంది. ఎందుకంటే, పరిశుద్ధాత్మ బాప్తిస్మపు శక్తిని తీసివేసినది ఆయనే. ఈ శక్తిని ఆయన తీసివేసెనని మనమెరుగుదుము. ఎందుకంటే, పరిశుద్ధాత్మ బాప్తిస్మం పొందిన అపొస్తలుల వంటి అద్భుతములను చేయగల వారినెవరినైనను ఇప్పుడు మనం కనుగొనలేం.

భావోద్రేకంతో గానీ, అద్భుతముల వలనభయాలు గానీ లేకుండగనే **దేవుని వాక్యశక్తిని** ఆధారం చేసుకొని ప్రజలను తనరాజ్యంలోనికి మార్పు చెందించుటకు యేసు ఇప్పుడు కోరుచున్నాడు కాబోలు! మనప్రభువు యొక్క సంఘం ప్రత్యేకమైనదని మనకు తెలుసు. అది క్రీస్తుశరీరంలా పని చేయు సంఘం దేవుని రాజ్యాన్ని గూర్చి మంచి అవగాహన కలిగిన సంఘలో అర్హతలుగల పెద్దలేదానికి నాయకత్వంవహిస్తారు. క్రీస్తు వంటి వ్యక్తిత్వం. శీలం గలవారి సమూహమే ఆ సంఘము. వారి విశ్వాసం అబ్రాహాము విశ్వాసము వంటిది. అద్భుతక్రియలు చేయకుండగనే ఈ ప్రత్యేక సంఘము పాపాన్ని గూర్చి, నీతినిగూర్చి, తీర్పునుగూర్చి లోకాన్ని ఒప్పుకొనజేస్తుంది. నిశ్చయంగా, క్రీస్తు నేడు ఇట్టి సువార్త కార్యక్రమమునే కోరుచున్నాడు. అందువలననే, నేడు ఎవరికిని ఆయన పరిశుద్ధాత్మలో బాప్తిస్మమిచ్చుట లేదు, అయితే, అద్భుతరీతిలో పరిశుద్ధాత్మ అందించిన సహకారంతోనే మొదటి శతాబ్ధంలో క్రీస్తు తన రాజ్యాన్ని స్థాపించగలిగినాడు.

## చర్చ కోసం ప్రశ్నలు

1. క్రొత్త నిబంధనలో పరిశుద్ధాత్మ బాప్తిస్మాన్ని గూర్చి ముందుగా మాట్లాడిందెవరు?
2. పరిశుద్ధాత్మ బాప్తిస్మం మొదట ఎప్పుడు జరిగినది?

3. పరిశుద్ధాత్మ బాప్తిస్మమును గూర్చి యేసు చెప్పిన మాటను పేతురు ఏ సంఘటనలో జ్ఞాపకం చేసుకొన్నాడు?
4. పరిశుద్ధాత్మ సహాయం చేయగా యేసు సాధించిన లక్ష్యమేమిటి?
5. పరిశుద్ధాత్మ సహాయంతో క్రీస్తు అమలుజరిపిన విజయవంతమైన సువార్త కార్యక్రమమును వర్ణించండి.
6. పరిశుద్ధాత్మలో బాప్తిస్మం పొందిన వెంటనే అపొస్తలులు సంపాదించిన కొన్ని శక్తులేవి?
7. పరిశుద్ధాత్మలో బాప్తిస్మం పొందిన తరువాత పేతురు ప్రవర్తనలోని మార్పును వివరించండి.
8. తమ పాఠములను సిద్ధం చేసుకొనుటలో అపొస్తలులకు సహాయం చేసినదెవరు?
9. అపొస్తలుల కార్యముల గ్రంథ పఠనంలో రాజైన యేసును గూర్చి మరిచిపోవుట ఎందుకు సులభం?
10. యేసు లోకాన్ని ఏ విషయంలో ఒప్పింపజేయగోరినాడు?
11. పరశుద్ధాత్మ బాప్తిస్మం ఫలితంగా అపొస్తలులు పొందిన శక్తులన్నింటినీ అంటే, మనం ఈ పాఠంలో చర్చించిన వాటిని కొన్నింటిని వరుసగా వ్రాయండి.
12. తనకు ఎంత శక్తిగలదని పౌలు వాదించినాడు?
13. పరిశుద్ధాత్మ ప్రత్యేక వరములను క్రైస్తవులకు అనుగ్రహించగల శక్తి అపొస్తలుల కొక్కరికే ఉందని మనమేల తలంచవలసి వుంది?
14. పరిశుద్ధాత్మ బాప్తిస్మము అను కొలతను క్రీస్తు నిలిపివేసెనని నీవెందుకు అను కుంటున్నావు?
15. దేవుని వాక్యంతో ఎట్టి సంఘం పాపాన్నిగూర్చియు, నీతినిగూర్చియు, తీర్పును గూర్చియు లోకాన్ని ఒప్పుకొనజేస్తుంది?



# మూడవ భాగము: పరిశుద్ధాత్మ ఆత్మ సంబంధమైన వరములు

## (Spiritual Gifts)

*మరియు దేవుడు సంఘములో మొదట కొందరిని అపొస్తలులు గాను, పిమ్మట కొందరిని ప్రవక్తలుగాను, పిమ్మట కొందరిని బోధకులుగాను, అటుపిమ్మట కొందరిని అద్భుతములు చేయువారినిగాను, తరువాత కొందరిని స్వస్థపరచు కృపావరములు గలవారినిగాను, కొందరిని ఉపకారములు చేయువారిగాను, కొందరిని ప్రభుత్వములు చేయువారిగాను, కొందరిని నానాభాషలు మాట లాడువారినిగాను నియమించెను.* *1 కొరింథీ. 12:28*

యేసుక్రీస్తు యొక్క లక్ష్యమేమంటే, ప్రపంచ వ్యాప్తంగా దేవుని రాజ్య పౌరులైన సంఘాన్ని లేక "బయటకి పిలువబడిన ప్రజల సమూహమును," కలిగి ఉండుటయే. యెరూషలేమునుగానీ, అంతియొకయగానీ, రోమాపట్టణంగానీ తన సంఘముయొక్క కేంద్ర స్థానముగా ఉండాలని ఆయన కోరలేదు. పరలోకమే కేంద్ర స్థానము. యేసు క్రీస్తు ఏకైక శిరస్సు (ఎఫెసీ. 4:15). మొదటిశతాబ్దపు మధ్య కాలంలో అపొస్తులుల కార్యముల గ్రంథంలో బయలుపరచబడినదియు, మనం కనుగొని నదియునైన సంఘం యేసు కోరిన సంఘము కాదు. తానుకాకుండా, అపొస్తలులు కానీ, మరే ఇతరమైన అధికారపూర్వకమైన శక్తులుగాని దాని మీద అధికారులై ఉండు ఒకసంఘాన్ని ఆయన కోరలేదు (అపొ. కార్య. 4:12) తన యొక్క వాక్యం ద్వారా సంఘాన్ని పోషించగల పెద్దల పరిపాలన క్రింద ఒక కుటుంబంగా పనిచేయు సంఘాన్ని ఆయన కోరాడు (అపొ. కార్య. 14:23 20:32). అయినప్పటికీ, అవసరమైన సువార్తసేవ కొనసాగుట కారంభించుటకు, తద్వారా ఒక తరంలో లోకమంతా స్థానిక సంఘములు స్థాపింప బడుటకు కొందరు పరిశుద్ధాత్మ ద్వారా బాప్తిస్మం పొందారు. తాను రోమా పట్టణంలో బంధింపబడు సమయానికి, సర్వలోకం సువార్త వినినదని అపొస్తలుడైన పౌలు చెప్పాడు (కొలొస్స. 1:23).

సువార్తసేవ ఎచటెచట విజయవంతమాయెనో అచట ఒక సంఘం స్థాపితమైనది. అపొస్తలుడైన పౌలు వంటి సువార్తికుడు ఒకచోటనే సంఘములో నిలిచిపోయివుంటే ప్రపంచవ్యాపకమైన తన సువార్త సేవను అది ఆటంకపరిచి ఉండెడిదే. అలాకాకుండా ఒకవేళ, అతడు క్రొత్త సంఘమును విడిచి వెళ్లిపోయిన యెడల సంఘమునకు అర్హతగల ఉపదేశకుడు లేకుండాపోతాడు, యేసు ఈ సమస్యను చాలనేర్పుగా పరిష్క రించినాడు. స్థానిక సంఘంలోని కొందరు సభ్యులకు ఆయన ఆత్మ సంబంధమైన వరములను ఇచ్చినాడు.

*మనమందరము విశ్వాసవిషయములోను దేవుని కుమారునిగూర్చిన జ్ఞాన విషయము లోను ఏకత్వముపొంది, సంపూర్ణపురుషులమగువరకు, అనగా క్రీస్తునకు కలిగిన సంపూర్ణతకు సమానమైన సంపూర్ణత కలవారమగువరకు, ఆయన ఈలాగు నియ మించెను.* *ఎఫెసి. 4:11,12*

దేవుని రాజ్యం కోసం యేసు తన లక్ష్యాలను తాను సాధించటానికి పరిశుద్ధాత్మ యేసుతో సహకరించిన మరోవిధానం ఇదే (1 కొరింథీ. 12:11). పరిశుద్ధాత్మశక్తివల్ల ఆత్మసంబంధమైన వరాల్ని కలిగిఉండిన ఈ క్రైస్తవులు **సువార్తికులుగా** పనిచేయగలిగారు. అలాగే, వారు స్థానికసంఘమునుగూర్చి శ్రద్ధవహించారు. ఉదాహరణకు, స్తెఫను, ఫిలిప్పులు సువార్తికులై ఉండిరి (అపొ. కార్య. 6:8; 7:59; 8:26; 39). అగబు అను ప్రవక్త రాబోయే సంగతులను గూర్చి ప్రవచించాడు (అపొ. కార్య. 11:28; 21:10,11) పౌలు తన యొక్క అపొస్తలత్వపు పిలుపులో పనిచేయు చుండిన దినాలలో అతని యొక్క అధికారం క్రింద సీల, తీతు మరియు తిమోతీలు వారు పొందిన ఆత్మవరముల వలన పనిని జరిగించినారు. (2 కొరింథీ. 8:23; తీతు 1:5; ఫిలిప్పీ. 2:19; అపొ. కార్య. 17:15). అంతేకాదు ఇతరులైన క్రైస్తవులు కూడా ఆత్మ సంబంధమైన వరములు కలిగిన వారై సంఘక్షేమాభివృద్ధికోసం స్థానికసంఘములలో పనిచేసారు.

కొరింథీపట్టణంలోని సంఘంలో ఆత్మసంబంధమైన వరములు కలిగిన సభ్యు లుండెడివారు. వారిలో అసూయ అనే సమస్య బయలుదేరిందికూడా. స్థానిక సంఘములో ఆత్మ సంబంధమైన వరములను ఎలా ఉపయోగించాలి అనే అంశాన్ని పౌలు ప్రస్తావించటానికి సందర్భమిదే (1 కొరింథీ. 12:1-11). **తొమ్మిదివరాలను** అతడు వరుసగా వ్రాసాడు. మనవలె బైబిలును కలిగి ఉండనిస్థానిక సంఘాలలో అవి ఎంతో ఆచరణయోగ్యమైనవే. పరిశుద్ధాత్మలో బాప్తిస్మంపొందిన ఏ అపొస్తలుడైనను సాధారణంగా ఈ తొమ్మిదింటినీ కలిగిఉండేవాడు.

అజ్ఞానులైన క్రైస్తవులచేగానీ, లేక సాతాను పనివారలచేగానీ క్రొత్తగా స్థాపింపబడిన ఈ స్థానిక సంఘములు పెడత్రోవ పట్టింపబడుటకు యేసు ఇష్టపడలేదు. కావున, ఆయన స్థానిక సంఘంలో ఒకరు లేక ఒకరికంటే ఎక్కువమందికి బుద్ధివాక్యాన్ని అనుగ్రహించాడు. స్థానిక సంఘసభ్యులు పొందిన ఇతరములైన ఆత్మసంబంధమైన వరము లేవనగా విశ్వాసము, స్వస్థపరుచువరము, అద్భుతములుచేయుశక్తి, ప్రవచనము మరియు ఆత్మల వివేచన, కొందరు క్రైస్తవులు భాషలు మాట్లాడు వరమును, ఇతరులు కొందరు ఈ క్రొత్త భాషలకు అర్థం చెప్పు వరమును కలిగి ఉండే వారు.

ఈ వరములు దేవునిరాజ్యాన్ని గూర్చి, వారు ఎలా పని చేయాలని యేసు కోరాడో ఆ విధానాన్ని గూర్చి స్పష్టమైన సందేశాన్ని సంఘాలకు అందించాయి. యేసుక్రీస్తు యొక్క సువార్త కార్య క్రమంలో వారిని సంసిద్ధులుగా చేయటానికి అవి తోడ్పడినాయి. ఉదాహరణకు, అల్ప విశ్వాసంతో ఉన్నవారు చేయలేని శక్తివంతమైన రీతిలో సువార్త ప్రకటన చేయటానికి విశ్వాసము అనే కృపావరమును కొందరు సభ్యులు కలిగి ఉండేవారు. స్వస్థపరుచువరము మరియు అద్భుతములు చేయుశక్తి సువార్తను వినునట్లు ప్రజలను ఆకర్షించుటలో ఉపయోగకరంగా ఉండేవి. సందేశం యదార్థ మైనదని నమ్మటానికి ఈ అద్భుతాలు తోడ్పడినాయి. అలాగే, ఈ వరములు రోగులను స్వస్థపరచటానికి ఉపయోగపడినాయి.

ప్రవచన వరం సంఘక్షేమాభివృద్ధి, హెచ్చరిక, ఆదరణ అనువాటికోసం అను గ్రహించబడింది (1 కొరింథీ. 14:3, 4). భాషలు అవిశ్వాసులకు సూచనగా ఉండినవి. అయితే, అవి భాషాబేధము లను తొలగించటానికి సహాయపడినవి. బహుశా, అర్థం చేసుకోలేనివారు ఉండినయెడల భాషల అర్థం చెప్పేవాని అవసరం ఉండెడిది. అందరి ప్రయోజనం నిమిత్తం భాషల అర్థం చెప్పుట అనే కృపావరం స్థానిక సంఘ సభ్యులకు అందుబాటులో ఉండినది. వేషధారులైయుండి, నటించువారి బారినుండి **కాపాడుబడు విధానం**. ప్రభువుచే యేర్పాటుచేయబడినది. తత్ఫలితంగా, కొందరు సభ్యులు ఆత్మలను వివేచించగలవారై ఉండిరి. ఆత్మలను పరీక్షించాలని యోహాను క్రైస్తవులను హెచ్చరిం చాడు.1 యోహాను 4:1

> *ఇందుచేత దేవుని ఆత్మవలన మాటలాడు వాడెవడును యేసు శాపగ్రస్తుడని చెప్ప డనియు, పరిశు ద్ధాత్మవలన తప్ప ఎవడును యేసు ప్రభువని చెప్పలేడనియు నేను మీకు తెలియజేయుచున్నాను.*
>
> *1 కొరింథీ. 12:3*

తన సంఘం కోసం క్రీస్తు తన మనస్సులో ఆలోచించిన **సంఘ ప్రభుత్వం కోసం** కొందరు సిద్ధపడ్డారు. బుద్ధి, జ్ఞానం, విశ్వాసంగల విజయవంతమైన తండ్రులు సంఘ పెద్దలు అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఆత్మీయ పెరుగుదల, భక్తిగల కుటుంబాన్ని ఒకడు కలిగి ఉండి, బుద్ధి, జ్ఞానం, విశ్వాసం అనే వరములు పొందు నప్పుడు మంచిపెద్ద కాగలడు. ప్రతి స్థానిక సంఘంలోను వారి వారి బాధ్యతలు నిర్వ హించటానికి సంఘంలో ఇష్టపడిన పురుషులకు జ్ఞానాన్ని, తెలివిని, చివరికి విశ్వాసాన్ని కూడా పరిశుద్ధాత్మ అనుగ్రహించాడు. వారు ఆత్మీయంగా పెరగాలి, భక్తిగల కుటుం బాన్ని కూడా కలిగి వుండాలి.

అపొస్తలుల ద్వారాను, ఇతరుల ద్వారాను లోకమందు సువార్త ప్రకటింపబడ టానికి, శక్తి వంతమైన విధానంలో పరిశుద్ధాత్మ ఎట్లు పనిచేసిఉండెనో ఈ పాఠంలో రెండవ భాగమందు మనం చూచినాము. అదేరీతిగా, "మనుష్యుల మాయోపాయముల చేత విచిత్రముగా కల్పిం పబడిన ప్రతిఉపదేశమునకు అటుఇటు ఎగురగొట్టబడిన వారమైనట్లుండక, ప్రేమకలిగి సత్యము చెప్పుటకు మన మన్నివిషయములలో క్రీస్తువలె ఎదుగుదము" అనిపౌలుచెప్పినట్లు సంఘానికి కాపుదల ఇవ్వడానికి పరిశుద్ధాత్మ ఎట్లు పనిచేసేనో ఈ పాఠంద్వారా గ్రహించుకొన్నాము (ఎఫెసీ. 4:13; 14). ఈ పాఠంలో ప్రస్తావించబడిన అద్భుతశక్తులతో సంఘం మొదటిశతాబ్ధంలో సంపూర్ణత లోకి నడిపించబడినది. అయితే, పౌలు సర్వోత్తమమైన మార్గమున్నదని సూచించినాడు (1 కొరింథీ. 12:31). యేసు కోసం, ఆయన సంఘం కోసం పరిచర్య చేయటానికి, ప్రేమలో క్షేమాభివృద్ధి

చెందటానికి అవసరమైన సమాచారం దేవుని గ్రంథంలో నేడు మనం కలిగి ఉన్నాము. దైవత్వంలోని ముగ్గురు వ్యక్తులూ మనతో పనిచేస్తున్నారు (2 కొరింథీ. 13:14). పరిశుద్ధాత్మ వాక్యం ద్వారా మనల్ని ఇంకా నడిపిస్తున్నాడు. అలాగే, మనలో నివసించుట ద్వారా కూడా మనలను బలపరుస్తున్నాడు (1 కొరింథీ. 6:19; ఎఫెసీ. 3:16). పరిశుద్ధపరచు కార్యాక్రమంలో పరిశుద్ధాత్మ పాత్రను గూర్చి ఈ పాఠం నాలుగవ భాగంలో మరింత ఎక్కువగా చదువుకుందాం.

## చర్చ కోసం ప్రశ్నలు

1. అపొస్తలుల కార్యములో బయలుపరచబడిన సంఘం సరిగా నేడు యేసు కోరుచున్న సంఘం వంటిది ఎందుకు కాదో వివరించండి.
2. సువార్త సేవ విజయవంతమైన అన్నిమారులు ఏమి సంభవిస్తుంది?
3. తాను స్థాపించిన సంఘాన్ని మొదటి శతాబ్ద మధ్యకాలపు సువార్తికుడు వెంటనే విడిచి వెళ్లిన యెడల ఏమి జరిగి ఉండెడిది? ఆలాగుననే అతడు నూతన సంఘంలో చాల కాలం నిలిచిపోతే ఏమి జరిగెడిది?
4. మూడవ ప్రశ్నకు నీవిచ్చు జవాబును బట్టి ఉత్పన్నమైన సమస్యను యేసు ఎట్లు పరిష్కరించాడు?
5. తిమోతీ, తీతుల పని ఈనాటి సువార్తికుని పనికి ఎట్లు భిన్నమైనది?
6. ఆత్మసంబంధ వరములను గూర్చి పౌలు వివరించటానికి అవకాశం కలిగించిన సందర్భమేది?
7. 1 కొరింథీ. 12వ అధ్యాయంలో పౌలు ప్రస్తావించిన ఆత్మసంబంధ వరముల న్నింటినీ వరుసగా వ్రాయండి.
8. సువార్త ప్రకటనలో సహాయం చేసిన వరములు మరియు స్థానికసంఘ క్షేమాభి వృద్ధిలో సహాయం చేసిన వరములు ఏవేవో వేరువేరుగా వర్గీకరించి చూపండి.
9. ఆదిక్రైస్తవులు సంఘపెద్దలు కాగలుగుటకు ఏ వరములు తోడ్పడినాయి?
10. భాషలతో మాట్లాడుట అంటే ఏమిటి?
11. ఆత్మసంబంధమైన వరములు కలిగిఉన్నామని అబద్ధంగా చెప్పుకొనిన మనుష్యుల బారి నుండి సంఘాన్ని యేసు ఎట్లు కాపాడినాడు?
12. "ఇదియుగాక సర్వోత్తమమైన మార్గమును మీకు చూపుచున్నానని" పౌలు చెప్పి నప్పుడు ఆయన భావమేమై ఉండెనని నీవు అనుకొనుచున్నావు?

# నాలుగవ భాగము: పరిశుద్ధాత్మ

# పరిశుద్ధ పరచు కార్యక్రమంలో పరిశుద్ధాత్మ పని

## (The Holy Spirit's Work in Sanctification)

## ఉపోద్ఘాతం

మొదటి శతాబ్దంలో దేవుని రాజ్యాన్ని నడిపించటంలో మనరాజైన యేసుక్రీస్తుతో పరిశుద్ధాత్మ ఎట్లు పనిచేసాడో ఇంతకు మునుపే మనం చూసాం. చరిత్రలో ఆ కాలమందు భౌతికమైన ఇశ్రాయేలీయుల అంతస్థు ఏ ఇతర జనాంగముల కంటే దేవుని ఉద్దేశముల విషయంలో ఇక ముఖ్యం కాదు (రోమా 11:1,23). క్రీస్తుశకం మొదటి శతాబ్దం ముగింపులో భూమిపై అంతటా స్థానిక సంఘాల్లో యూదులు, అన్యులు అనే దేవుని ప్రజలు ఇరువురూ ఉండేవారు (యాకోబు1:1 ; ఎఫెసీ. 2:13 18). కొందరు అపొస్తలులైతే అప్పటికే క్రీస్తునందు నిద్రించారు. ఒక వేళ మిగిలిన వారిలో బ్రతికి ఉన్నవారు చాలా వృద్ధులుగా ఉన్నారు (అపొ. కార్య. 12:2; 2 తిమోతి. 4:6). ఆ కాలంలో వారూ, అలాగే పరిశుద్ధాత్మ, మనరాజుయొక్క ఉద్దేశాల్ని నెరవేర్చి నారని మనం భావింప వలసివుంది.

నేడు తన సంఘం కోసం యేసు అవే ఉద్దేశాలను కలిగివున్నాడు. అయితే తన ఉద్దేశాలను అమలుపరచటానికి (expediting) భిన్నమైన పని వారిని, (different staff) మరియు భిన్నమైన విధానం ఆయన కలిగి వున్నాడు. యేసుయొక్క పరిచర్య సిబ్బంది (administrational staff) ఇక అపొస్తులులను కలుపుకోదు. అయితే, పరిశుద్ధాత్ముని మాత్రం వారితో చేర్చవలసివుంది. అపొస్తులులును, దైవావేశపూరితులైన ఇతరులును జీవించి ఉండగా, పరిశుద్ధాత్మ వారిలో కొందరిని దేవుని నియమములను వ్రాయటానికి వాడుకొన్నాడు పరిశుద్ధాత్మబాప్తిస్మం, ఆత్మసంబంధమైన వరములు అనేవి సంఘసభ్యులకు ఇక అందు బాటులో లేకుండిన తరువాత కూడా యేసుక్రీస్తు రాజ్యపౌరులను ఈ ఆజ్ఞలు నడిపిస్తున్నాయి (2 తిమోతి. 3:16,17; 2 పేతురు 1:20,21; 1 కొరింథీ. 12:28-31).

ఈ అద్భుతాలు ఎప్పుడు, ఎట్లు అంతమాయెనని మనం ఒకరోజంతా వాదించు కోవచ్చు. కానీ అందరం గుర్తింపవలసినదేమనగా పరిశుద్ధాత్మ ఒకవ్యక్తి, అంతేగానీ ఒక విధానంకాదు. ఆయనశక్తికి పరిమితులను యేర్పరచి దోషులం కాగోరుటలేదు. ఒకవేళ ఈనాడు కూడా మొదటి శతాబ్దపు శక్తులు అవసరమని దేవుడు నిర్ణయించు కొంటే యేసుతో సహకరించటం ఎట్లో పరిశుద్ధాత్మ మరిచిపోడని మనం నిశ్చయముగా ఎరుగుదుము. ఒప్పింపచేయటానికి అవసరమైన పరిశుద్ధాత్మ శక్తినే మనం చూడవలసి వుంది. అయినప్పటికినీ, ప్రత్యక్షతలేకుండా ఈనాడు దేవునిఆత్మచేత ప్రేరేపింప బడితినని ఒకడు చెప్పుకొనినయెడల వాని వాదనను మనం అంగీకరించం. మొదటి శతాబ్దములో ఆత్మ పూర్ణులైన స్త్రీ పురుషుల ద్వారా క్రింది కార్యములు నెరవేర్చబడినవి. ఈ క్రిందిలేఖనంలో చూపబడిన అద్భుతములను అట్టివారు చేయవలసినవారై ఉన్నారు.

> *నమ్మినవారివలన ఈ సూచక క్రియలు కనబడును ఏవనగా నా నామమున దయ్యము లను వెళ్లగొట్టుదురు క్రొత్త భాషలు మాటలాడుదురు, పాములను ఎత్తిపట్టు కొందురు. మరణకరమైనదేది త్రాగినను అది వారికి హాని చేయదు, రోగులమీద చేతులుంచి నప్పుడు వారు స్వస్థత నొందుదురని వారితో చెప్పెను.* మార్కు 16:17,18

ఈ క్రిందిలేఖనంలో ఈశక్తుల అంతాన్నిగూర్చి పౌలు మాట్లాడెనని కొందరు నమ్ము తారు. మనము కొంతమట్టుకు ఎరుగుదుము, కొంతమట్టుకు ప్రవచించు చున్నాము గాని పూర్ణమైనది వచ్చినప్పుడు పూర్ణముకానిది నిరర్థకమగును అని పౌలు చెప్పినప్పుడు 1 కొరింథీ.13:9,10; మొదటిశతాబ్దంలో, పరిశుద్ధాత్మశక్తిని నేరుగా పొందిన సువార్తికుడు గానీ, బోధకుడుగానీ ప్రతి సందర్భములోను కొంతకొంత సందేశాన్ని పొందినాడు. ఈనాడు మన విశ్వాసం నిమిత్తం బైబిలులో సంపూర్ణసందేశం మనకుంది. భూమి మీద దేవుని రాజ్యం కొనసాగుతున్న ఈ అంత్యదినాల్లో, దేవుని ఉద్దేశాలను సాధించటానికి దేవుని యొక్క అంతిమ సంకల్ప విషయంలో మనం సంపూర్ణ సందేశాన్ని కలిగి వున్నాం మొదటి శతాబ్దం ముగియక ముందే ఈ సందేశం అనగా క్రైస్తవుని విశ్వాసం పరిశుద్ధులందరికోసం ఒక్కమారే అనుగ్రహించబడినది (యుదా 3). అద్భుత ములు చేయబడినదినాల్లో వారు కొంతవరకే సందేశాన్ని కలిగి ఉన్నారు. మనమైతే సంపూర్ణసందేశాన్ని కలిగి ఉన్నాం. ఎందుకంటే, అది సంపూర్ణంగా వ్రాయబడినది. (ఎఫెసీ. 1:10). బైబిలు గ్రంథంలోని సందేశం ఒక వేళ సంపూర్ణం కాకపోతే 2000 సంవత్సరాలుగా క్రైస్తవులు అసంపూర్ణ సందేశంతో జీవించుచున్నట్టే అవుతుంది.

బైబిలులో మనం కలిగిఉన్న సందేశానికి భిన్నంగా బోధించుచునే తాను దేవుని యొద్దనుండి సందేశాన్ని పొందితినని చెప్పుకొనే ప్రవక్తను మనం తృణీకరింపవలసివున్నది (గలతీ. 1:6-12). పరిశుద్ధాత్మద్వారా నడిపింపబడిన వారివలన మొదటి శతాబ్దపు సంఘములు పొందిన సమాచారమంతా నేటి సంఘాలు కలిగేవున్నాయి, ఏలాగు పని చేయాలో, ప్రభువు ఉద్దేశములకోసం, నిత్యజీవం కోసం అవసరమైన అన్ని అంశముల విషయంలోను ఏమి ప్రకటించవలెనో, ఏమి బోధించవలెనో మనమెరుగుదుము. దైవాధీనమైనకాపుదల, దేవుని జ్ఞానము దేవుని చిత్తానుసారంగా అడుగు వారికి ఇప్పుడూ అనుగ్రహించబడతాయి (యాకోబు 1:5,6).

యేసుక్రీస్తు రాజ్య పౌరులతో పరిశుద్ధాత్మ ఇంకనూ పనిచేస్తాడా? లేక పరిశుద్ధాత్మ వల్ల ప్రేరేపింపబడి లిఖింపబడిన చివరిమాటలు వ్రాయటం జరిగిపోయాక ఆయన పని సంపూర్ణమై

పోయిందా? రోగుల కోసం అలాగే దేవుని సహాయం అవసర మయ్యే ఇతర సందర్భములలోను మనం చేసిన ప్రార్ధనలకు దేవుడు ప్రతిస్పందిస్తాడని మనకు తెలుసు. నేడు దేవుడు చేసుకొనే జోక్యానికి, ఆనాడు ఆత్మ సంబంధమైన వరములను పొందిన వారిద్వారా పనిచేసిన విధానానికీ ఎంతో భేదముంది (యాకోబు 5:13-16). నేడు మనంచేసిన ప్రార్ధనలకు జవాబుగా స్వస్థపరచు శక్తి దేవునికి సంబంధిం చింది. అయితే, ఆత్మసంబంధమైన వరములు యేసుక్రీస్తు నామమున స్వస్థపరచుశక్తిని కొందరు క్రైస్తవులకు ఇచ్చినవి. మనపట్ల దేవుడు ఇంకనూ ఆసక్తి కలిగేవున్నాడు యేసు పరిపాలన విషయంలో పరిశుద్ధాత్మ తన పనిని ఇంకా ముగించలేదు. పరిశుద్ధపరచు కార్యక్రమంలో పరిశుద్ధాత్మ ఇంకనూ తన పాత్రను కలిగేవున్నాడు. పరిశుద్ధాత్ముని పనినిగూర్చి ఈ పాఠంలోని చివరిభాగంలో మన అంశమిదే.

## పాఠము

మన ప్రభువైన యేసుక్రీస్తు యొక్క లక్ష్యమేమనగా తన రాజ్య పౌరులమైన మనలో ప్రతిఒక్కరినీ తనయొక్క సారూప్యంలోకిమార్చి. మనలనందరినీ దేవుని కుమా రులుగా తండ్రియైన దేవుని ఎదుట నిలబెట్టుట (కొలొస్స.1:27; గలతీ.4:19). తన లక్ష్యాన్ని సాధించటానికి యేసు ప్రణాళికేమంటే మనల్ని పరిశుద్ధపరచే కార్యక్రమంలో మనలో ప్రతి ఒక్కరితో పరిశుద్ధాత్మ చేసే పనియే. ఈ క్రింది లేఖనంలో పరిశుద్ధ పరచు కార్యక్రమం పరిశుద్ధాత్మ పని అని పేతురు ప్రకటించాడు.

> *ఆత్మవలని పరిశుద్ధతపొందినవారై విధేయులగుటకును, యేసుక్రీస్తు రక్తమువలన ప్రోక్షింపబడుటకును ఏర్పరచబడినవారికి, అనగాపొంతు, గలతీయ, కప్పదొకియ, ఆసియ, బితూనియ అను దేశములయందు చెదరిన వారిలో చేరిన యాత్రికులకు శుభమని చెప్పి వ్రాయునది. మీకు కృపయు సమాధానమును విస్తరిల్లునుగాక.. 1 పేతురు 1:2*

అన్యజనుల నిమిత్తమైన అబ్రాహామునకు వాగ్దానం చేయబడిన దీవెనలో **పరిశుద్ధాత్మ సహవాసం ఒకటి** (గలతీ. 3:14). వాస్తవానికి, పరిశుద్ధాత్మను గూర్చిన వాగ్దానం యేసునందు విశ్వాసముంచి విధేయులైన ప్రతిఒక్కరికీ వర్తిస్తుంది (అపొ. కార్య. 2:39; 5:32). పరిశుద్ధాత్మ సహవాసంకోసం క్రైస్తవులు అడగలవలసినవారై ఉన్నారు (లూకా 11:13; 1 థెస్స 4:8; 2 కొరింథీ. 13:14). పరిశుద్ధపరచు కార్యక్రమంలో పరిశుద్ధాత్మ పనిలోని ఉద్దేశమేమంటే ఆత్మసంబంధమైన బలాన్ని క్రైస్తవులు సంపాదించుకోవటానికి సహాయంచేయటమే (ఎఫెసీ. 3:16). "ఎవడైనను దప్పిగొనిన యెడల నాయొద్దకు వచ్చి దప్పిక తీర్చుకొనవలెను" అని యేసు చెప్పి, ఆ మీదట ఈక్రింది విధంగా చెప్పాడు.

> *నాయందు విశ్వాసముంచు వాడెవడో లేఖనము చెప్పినట్లు వానికడుపులో నుండి జీవనదులు పారునని బిగ్గరగా చెప్పెను. తనయందు విశ్వాసముంచువారు పొందబోవు ఆత్మనుగూర్చి ఆయన ఈ మాట చెప్పెను. యేసు ఇంకను మహిమ పరచబడ లేదు గనుక ఆత్మ ఇంకను అనుగ్రహింప బడియుండలేదు. యోహాను 7:38,39*

అంత్యదినములను లేక క్రైస్తవయుగాన్ని **పరిశుద్ధాత్మ పరిచర్య** దినములని పిలుస్తారు, ఇతరయుగాల్లోకంటే ఎక్కువ సన్నిహితంగాను, వ్యక్తిగతం గాను ఆయన క్రైస్తవులతో ఇప్పడు పనిచేస్తున్నాడు (2 కొరింథీ. 3:8). తండ్రి కుమారులిరువురూ మనలో నివసించుచున్నారని ఆయనసన్నిధి మనలో నమ్మకాన్ని పుట్టిస్తుంది (యోహాను 14:23; 1 యోహాను 3:24). యేసు తనయొక్క సింహాసనం మీద మహిమపరచబడిన తరువాత ఇదంతా ఆరంభమైనది.

దైవావేశ లేఖనాల్లో నిత్యజీవపు మాటలను మనకోసం వ్రాయించి, పరిశుద్ధాత్మ మనకు పరిచర్య చేస్తున్నాడు. (2 కొరింథీ. 3:1-3). ఆయన తనయొక్క ధర్మవిధులను మన హృదయాల్లోనూ, మనస్సులలోనూ, వ్రాయటం క్రొత్త నిబంధనలో ఒక భాగం (హెబ్రీ. 10:16,17). మన ఆంతర్యపురుషునిలో సంపూర్ణనియమం లేక స్వాతంత్ర్య మునిచ్చు ఈ నియమాన్ని, మనలో నాటుట కొసమైన సంకల్పంలో మనలను నడిపిం చుట ద్వారా ఆయన మనకు జీవమునిస్తాడు. మనము క్రీస్తుసారూప్యంలోకి రూపాంతరం చెందుచున్నందున "నవీన స్వభావాన్ని" ధరించుకొనిన వారమై ఉంటాము. ఈ క్రింది లేఖనాల్ని ఆలోచించండి.

> *ఆయనే మమ్మును క్రొత్త నిబంధనకు, అనగా అక్షరమునకు కాదు గాని ఆత్మకే పరిచారకులమవుటకు, మాకు సామర్థ్యము కలిగించియున్నాడు. అక్షరము చంపును గాని ఆత్మ జీవింపచేయును. 2 కొరింథీ. 3:6*

> *అందుచేత సమస్త కల్మషమును, విజృంభించుచున్న దుష్టత్వమును మాని,లోపలనాటబడి మీ ఆత్మలను రక్షించుటకు శక్తిగల వాక్యమును సాత్వికముతో అంగీకరించుడి. యాకోబు. 1:21*

> *కావున మేము అధైర్యపడము మాబాహ్య పురుషుడు కృశించుచున్నను, ఆంతర్య పురుషుడు దినదినము నూతన పరచబడుచున్నాడు. 2 కొరింథీ. 4:16*

> *నీతియు యదార్థమైన భక్తియుగలవారై, దేవుని పోలికగా సృష్టింపబడిన నవీన స్వభావమును ధరించుకొనవలెను. ఎఫెసీ. 4:24*

పరిశుద్ధాత్మ పరిచర్య ఫలం మనజీవితాల్లో ఈక్రింది లక్ష్యాలద్వారా ప్రత్యక్షపరచబడుతుంది. అయితే ఆత్మ ఫలమేమనగా ప్రేమ, సంతోషము, సమాధానము, దీర్ఘశాంతము, దయాళుత్వము, మంచితనము, విశ్వాసము, సాత్వికము, ఆశా నిగ్రహము. ఇట్టివాటికి విరోధమైన నియమమేదియు లేదు. గలతీ. 5:22,23.

పరిశుద్ధాత్మ పరిచర్యలో క్రైస్తవుని పాత్ర క్రొత్త నిబంధనను అంగీకరించటమే. యేసు తన రక్తములో మనల్ని కడగనీయాలి. ఆత్మసంబంధమైన జీవితంలో ఆయనను నడవనిచ్చుట ద్వారా

ఆత్మచే నడుచుకొంటాము (రోమా. 8:5-8). గలతీయులకు పౌలు వ్రాసిన తన యొక్క పత్రిక ప్రకారం మనల్ని ఆయన నడిపించు ఏకైకమార్గమిదే.

> *నేను చెప్పునదేమనగా ఆత్మానుసారముగా నడుచు కొనుడి, అప్పుడు మీరు శరీరేచ్ఛను నెరవేర్చరు, శరీరము ఆత్మకు ఆత్మ శరీరమునకును విరోధముగా అపేక్షించును. ఇవి యొకదానికొకటి వ్యతిరేకముగా ఉన్నవి గనుక మీరేవి చేయ నిచ్ఛయింతురో వాటిని చేయకుందురు.*
> *గలతీ. 5:16,17*

"ఆయన యందు నిలిచియున్నవాడనని చెప్పుకొనువాడు ఆయన ఏలాగు నడుచుకొనెనో అలాగే తానును నడచుకొనబద్ధుడై ఉన్నాడు." అని యోహాను చెప్పిన మార్గంలోని మెట్లులే ఈనడకలో అగుపిస్తాయి (1 యోహాను 2:6). క్రైస్తవులను పరిశుద్ధాత్మ నడిపించు సాధనం దేవునివాక్యమే. మొదటి శతాబ్దంలో దేవుని ఆత్మచే ప్రేరేపింపబడిన వారిద్వారా ఆయన మనకు బయలుపరిచిన సత్యమందు ఆయన మనలను ప్రతిష్ఠచేస్తాడు (యోహాను 17:17). అయినప్పటికీ, ఈ అంత్య దినములలో పరిశుద్ధపరచు కార్యక్రమంలో ఆయన మరొక సాధనాన్ని ఉపయోగిస్తు న్నాడు. మన ఆంతర్యపురుషుని బలపరచటానికి మన సొంతశరీరాల్లో ఆయన **వ్యక్తిగతంగా నివసించుచున్నాడు**. తద్వారా ఆయనకాదు, మనమే శారీరకక్రియల్ని చంపగలం. ఈ క్రింది లేఖనాల్ని మనం ఆలోచించుదాం.

> *మీ దేహము దేవునివలన మీకు అనుగ్రహింపబడి, మీలో నున్న పరిశుద్ధాత్మకు ఆలయమై యున్నదని మీరెరుగరా? మీరు మీ సొత్తుకారు.* *1 కొరింథీ. 6:19*
>
> *...మీరు అంతరంగపురుషునియందుశక్తి కలిగి ఆయన ఆత్మ వలన బలపరచబడు నట్లుగాను, ప్రార్థించుచున్నాను.* *ఎఫెసీ. 3:15-18*
>
> *కాబట్టి సహోదరులారా, శరీరానుసారముగా ప్రవర్తించుటకు మనము శరీరమునకు ఋణస్థులము కాము. మీరు శరీరానుసారముగా ప్రవర్తించినయెడల చావవలసినవారై యుందురు గాని ఆత్మచేత శారీరక్రియలను చంపినయెడల జీవించెదరు.* *రోమా. 8:12,13*

పరిశుద్ధపరచు కార్యక్రమాన్ని అంతటినీ, పరిశుద్ధాత్మ వాక్యం ద్వారానే చేస్తాడని కొందరు నమ్మారు. అయితే కొరింథీలో ఉన్న క్రైస్తవుల దేహాల్లో పరిశుద్ధాత్మ ఉండెనని పైలేఖనాల్లో పౌలు చెప్పాడు. వాక్యం ద్వారా చేయటానికి సాధ్యంకాని పరిశుద్ధాత్మ పనులలో ఒక పనిని ఈ క్రింది లేఖనం బయలుపరుస్తుంది. దేవునికి మనం చేసేప్రార్థన విషయాలలో ఆయన మన కోసం విజ్ఞాపనము చేస్తున్నాడు. బలహీనమైన ప్రార్థనా జీవితంగలవారికి పరిశుద్ధాత్మ వాక్యం ద్వారా సహాయం చేయగలడు. కాని, వాక్యం ద్వారా ఆయన మనకొరకు విజ్ఞాపన చేయలేడుగదా! **సరే విజ్ఞాపన చేయటానికి ఆయన మనలో నివసింపవలసిన అవసరంలేదు.** కానీ, ఆయన మనలో నివసించుచున్నాడని మనమెరుగుదుము.

> *అటువలె ఆత్మయు మన బలహీనతను చూచి సహాయము చేయుచున్నాడు. ఏలయనగా మనము యుక్తముగా ఏలాగు ప్రార్ధన చేయవలెనో మనకు తెలియదు గాని, ఉచ్చరింప శక్యముకాని మూలుగులతో ఆ ఆత్మ తానే మన పక్షముగా విజ్ఞాపనము చేయుచున్నాడు. మరియు హృదయములు పరిశోధించువాడు ఆత్మయొక్క మనస్సు ఏదో యెరుగును; ఏలయనగా ఆయన దేవుని చిత్తప్రకారము పరిశుద్ధులకొరకు విజ్ఞాపనము చేయుచాన్నాడు.* *రోమా.8:26,27*

వాక్యం ద్వారా పరిశుద్ధాత్మ మన ఆంతర్య పురుషుడ్ని బలపరుస్తాడు. అయితే మనలను బలపరుచుటకు ఆయన మనలో కూడా నివసిస్తాడు. తండ్రియైన దేవునికీ మనకీ మధ్య ఉత్తరప్రత్యుత్తరాలలో సహాయంచేయటంద్వారాను, మన తండ్రియొక్క కుమారులమనే గుర్తింపు అనుగ్రహించుటద్వారాను,వ్యక్తిగత సహవాసంలో మనయొక్క పునరుత్థానము స్వాస్థ్యములనుగూర్చి దృక్పథంద్వారాను ఆయన ఈ పనిని చేస్తాడు.

దేవునికి మనకి మధ్యఉండే **ఉత్తరప్రత్యుత్తరాల**లో పరిశుద్ధాత్మ ఎట్లు సహాయం చేస్తాడో మనం ముందుగా ఆలోచించుదాం. దేవునితో మనం సంబంధ బాంధవ్యములను కలిగి ఉంటిమని మనం అంగీకరించాం. అయినప్పటికీ, పరిశుద్ధాత్మ మనకోసం విజ్ఞాపన చేయుచున్నం దున అది సాధ్యమౌతుంది. మన బలహీనతలలో ఆయన సహాయం చేస్తాడని అపొస్తలుడైన పౌలు చెప్పాడు (రోమా. 8:22-27). అయితే ఆయన మనకెట్లు సహాయంచేస్తాడు? ఉచ్చరింపశక్యం కాని మూలుగులతో ఆత్మతానే మన పక్షంగా విజ్ఞాపనము చేస్తున్నాడు. దేవుని యొక్క మనస్సు ఏదో ఆత్మ ఎరుగును. ఎందుకంటే, దేవునిచిత్తానుసారంగా పరిశుద్ధుల కోసం ఆయన విజ్ఞాపనము చేస్తున్నాడు. దేవుని యొక్క ఆలోచనలను, చిత్తాన్ని ఆత్మ ఎరుగును (1 కొరింథీ. 2:11). పరిశుద్ధాత్మ క్రైస్తవునిలో నివసిస్తాడు. ఆత్మ సంబంధులతో పనిచేయ సమర్థుడై ఉన్నాడు (రోమా 8:6).

> *దేవుని ఆత్మ మీలో నివసించియున్నయెడల మీరు ఆత్మ స్వభావము గలవారే గాని శరీర స్వభావము గలవారు కారు. ఎవడైనను క్రీస్తు ఆత్మలేనివాడైతే వాడాయనవాడు కాడు.* *రోమా 8:9*

మనం దేవునికిచేసే ప్రార్థనల్లోని **విషయం మరియు ఉద్దేశం** అనువాటిని దేవుడు గ్రహించి నాడని మనకు దృఢపరచటానికి అందరికంటే పరిశుద్ధాత్మ అత్యంత శ్రేష్ఠమైన పని జరిగిస్తున్నాడు. మన విషయాలను మనం సరిగా తెలియజేయ సమర్థులం కాకపోవచ్చు. లేదా, దేవుని చిత్తాన్ని పూర్తిగా ఎరుగగలవారం కాకపోవచ్చు. మనం దేవుని కుమారులమని ఆత్మ తానే మనఆత్మతో సాక్ష్యమిచ్చు చుండినయెడల మనం చేసే ప్రార్థనల్లోనే విషయాలను ఆత్మ బాగుగా గ్రహించగలవాడై ఉన్నాడు (రోమా. 8:16).

మనకురాని భాష మాట్లాడే దేశమందు మనం ఉండనంతవరకూ ఉత్తర ప్రత్యుత్తరాలు మన ఆంతర్య పురుషుని ఎట్లు బలపరుస్తాయో గ్రహించికొని అభినందించలేము. ఉదాహరణకు, మనం ఒక విదేశంలో ఉన్నామనుకుందాం. మందులు అవసరమయ్యాయి. అయితే వారిభాష

మనకు తెలియనందున మందులు అమ్మే వ్యక్తి మన కోరికను గ్రహించలేడని భయపడతాము. అందుచేత సంభాషించుటకు ప్రయత్నిం చటానికి సంశయిస్తాము. జీవితంలో ఉత్తరప్రత్యుత్తరాలు లేనపుడు మనస్థితి బలహీన మౌతుంది. పిల్లలు తమయొక్క అభిలాషలను, పొగడ్తలను తమ తల్లితండ్రులకు తెలియపరచుకొనునట్లు ఉత్తరప్రత్యుత్తరాల ప్రాముఖ్యం మన మెరుగుదుము. సంభా షించగలసామర్థ్యం పిల్లలు కలిగివున్నందున పిల్లలతోపాటు తల్లితండ్రుల జీవితాలు కూడా ప్రతిస్పందిస్తూ వుంటాయి. తమయొక్క ఆలోచనలను, కోరికలను ఇతరులకు తెలియజేయుటంలో చాలమందికి సమస్య వుంటుంది. తద్వారా, తమ సమాజంలో సాంఘీకీకరణం చెందటానికి ఇది ఆటంకమౌతుంది. ప్రజలయొక్క ఆనందం మరియు క్షేమం తమ సమాజంలోకి వారు సాంఘికీకరణం చెందటం మీద ఎక్కువగా సంబంధం కలిగివుంటుంది.

అలాగే, పరలోకమందున్న మన తండ్రితో క్రైస్తవులమైన మనం ఉత్తర ప్రత్యుత్త రాలు జరుపుకోవటం ముఖ్యం. దేవునియొక్క పరలోక సమాజంలోకి మనం సాంఘీకీ కరణం లేక పరిశుద్ధపరచబడటం జరిగింది. తన యొక్క వాక్యం ద్వారా తండ్రి మనతో మాట్లాడతాడు. ఆయనచిత్తాన్ని గ్రహించుట అత్యంత ప్రాముఖ్యం, ఆత్మ సంబంధమైన ఆలోచనలతో ఆత్మసంబంధమైన మాటలను సరిపోల్చి, పరిశుద్ధాత్మ వాటిని మనకు బైబిలు గ్రంథంలో అనుగ్రహించాడు (1 కొరింథీ. 2:13). **ప్రార్థనలోమనం మనతండ్రితో సంభాషిస్తాము. అవసరమైనప్పుడు పరిశుద్ధాత్మ మనకోసం విజ్ఞాపన చేయ టానికి తండ్రి దగ్గరే ఉంటాడు.** మనల్ని ఆయన అపార్థం చేసుకుంటాడని మన పర లోకపు తండ్రితో మాట్లడకుండుట భయంకరం. ప్రార్థనల ద్వారా సరియైన ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపబడుతూ, అపార్థాలు, అర్థం కానివీ ఏవి లేవని గ్రహించినప్పుడు ఆంతర్య పురుషునిలో మనం బలపరచబడతాము (1 యోహాను 5: 14).

శరీరక్రియల్ని మనం చంపటానికి మన ఆంతర్యపురుషుడ్ని పరిశుద్ధాత్ముడు బలపరచు మరో విధానమేమంటే **దేవునికుమారులమని మనల్ని మనం గుర్తించు కొనుటలో** సహాయం చేయట. బలమైన శీలం విషయంలో "గుర్తింపు" యొక్క ప్రాధాన్యతను గూర్చి మన మనోనేత్రాలు వెలిగింపబడనియెడల ఈ సందర్భంలో ఈ అంశముపై కొద్దిపాటి పరిశీలన సహాయకరంగా వుంటుంది. పరిశుద్ధాత్మ మన ఆత్మతో దేవుని పిల్లలమని సాక్ష్యమివ్వటం దేవునికుమారులమని మనం గుర్తించు కొనేటట్లు సహాయ పడుతుంది. (రోమా. 8:16). యౌవనస్థులు చివరికి ఒక స్థిరమైన గుర్తింపునకు వచ్చుటకు ముందు కొన్ని మెట్లు ఆలోచించుదుము. చెప్పాలంటే, వారు ఒకపాత్రను సాధించ ప్రయత్నించి, అదే పాత్రలో సమాజానికి వారు తమ్మును తాము బయలు పరచుకొని, వారిని సమాజం ఆ పాత్రలో అంగీకరించుచున్నదీ లేనిదీ తెలిసికోవటానికి ప్రయత్నిస్తారు. వారు ఒక పాత్రలో అంగీకరింపబడకపోతే తమ యొక్క ఆదర్శపాత్రగా మరోదాన్ని క్రొత్త పాత్రలను కనుగొనటానికి ప్రయత్నిస్తారు. తమ పాత్రను చూచినవారి ప్రతిస్పందనతో అర్థవంతమైన రీతిలో యౌవ్వనస్థులు తమ్మును తాము గుర్తింపచేసుకొనుట ఎంతోముఖ్యం. బహుశా, మనలో ప్రతిఒక్కరం అన్ని వయస్సులలోను గుర్తింపు ప్రక్రియలోనే కొనసాగుతున్నాం. అయితే యౌవ్వన దశలో గుర్తింపు విషయంలో చురుకుదనం అధికం. చాలా మంది స్థిరమైన గుర్తింపును ఎన్నడూ సాధించలేరు తత్ఫలితంగా వారు బలహీన శీలాన్ని కలిగి వుండి ఎప్పుడూ బాధపడుతూనే ఉంటారు.

సృష్టి విషయంలోని ఉద్దేశంతో రాజ్య పౌరులు గుర్తింపుకలిగి ఉండవలసిన అవసరం యేసు ఎరిగిందే. **దేవునికుమారులమని మనం గుర్తింపుపొందితే**, శారీరక క్రియలను చంపి, ప్రభువైన యేసుక్రీస్తును ధరించుకొనుటకు ఈనూతన "గుర్తింపు" దోహదం చేయునని ఆయన ఎరుగును. మనం గుర్తించినస్థాయిలోనే మనుష్యులు జీవనపు స్థాయిలోగానీ, మరణ దశలో గానీ ప్రవర్తిస్తారు. అంటే అబద్ధికులు అబద్ధ మాడతారు: దొంగలు దొంగిలిస్తారు, కొందరు స్త్రీలు తమ్మును తాము అమ్ముకుంటారు చాలామంది స్త్రీలు అట్టిఆలోచననే రానీయరు. ఈ భిన్నమనస్తత్వాలకు కారణం వారు తమ్మును తాము గుర్తించుకొనిన విధానమే. క్రైస్తవుని గుర్తింపు విలువవిషయంలో పరిశుద్ధాత్ముని పాత్రను గూర్చి అపొస్తలుడైన పౌలు ఈక్రిందిలేఖనంలో తెలియ జేస్తున్నాడు. 'మరియు *మీరు కుమారులై యున్నందున -నాయనా తండ్రీ , అని మొఱ్ఱపెట్టు తన కుమారుని ఆత్మను దేవుడు మన హృదయములలోనికి పంపెను." గలతీ. 4:6*

మన నూతన జన్మ మనకి దేవునికుమారుల అంతస్థు అనుగ్రహించినా ఈ క్రొత్త అంతస్థు మన సొంత వ్యక్తిగత గుర్తింపుగా ఉండటానికి మనకెంతో సహాయం అవసరమని యేసు ఎరుగును. మన తండ్రిగా దేవుని మనము అంగీకరించుటలో సహాయం చేయునట్లు పరిశుద్ధాత్మను పంపుటలో ఇది ఒక కారణం మాత్రమే. మనతో పరిశుద్ధాత్ముడు ఉన్నాడని మనకెట్లు తెలుస్తుంది? అని ఒకరు అడగవచ్చు. ఈ ప్రశ్నకు జవాబునివ్వటానికి, "నాయనా! తండ్రీ అని మనం దేవునికి మొఱ్ఱపెట్టటం క్రైస్తవులు అయిన ఎంతకాలానికి ఆరంభించితిమి?" అని మనం అడుగవలసి వుంది.

దేవుడ్ని మనం తండ్రియని పిలిచినప్పుడు ఆదరణ పొందు తుంటే ఈ అనుభూతి పరిశుద్ధాత్ముని సన్నిధిని బట్టి కలిగినదని మనం భావించాలి. బైబిలు అదే బోధిస్తుంది. మన పాపాలు కడుగబడినవిధానాన్ని యేసు రక్తానికి సరిగా ఆరోపించుదాం. ఆ మీదట అదేరీతిలో సరిగా దేవుడు మన తండ్రి అనే గుర్తింపుకు దేవుని వాక్యంద్వారాను, మనం దేవునికుమారులమని మన ఆత్మలతో సాక్ష్యమిచ్చుట ద్వారానుచేసే, పరిశుద్ధాత్మునిపనికి ఆరోపించుదాం. మన పాపాలు కడుగబడినయెడల యేసురక్తముచట ఉందని మనమెరుగుదుము. అలాగుననే, మనతండ్రిగా

దేవుని మనము పిలిచి నప్పుడును పరిశుద్ధాత్మ మనలో ఉన్నాడు. ఈరెండు నమ్మకాలకు బైబిలు గ్రంథమే మూలాధారం.

పరిశుద్ధాత్ముని సహాయం వల్ల కలిగే క్రైస్తవ గుర్తింపు అనే భావన క్రియా రూపంలో ఎలా వుంటుందో రోమా. 8:16 లో చూపబడింది. పౌలు ఇలా చెప్పాడు."మనము దేవుని పిల్లలమని ఆత్మ తానే మన ఆత్మతో కూడా సాక్ష్యమిచ్చుచున్నాడు". పై లేఖనం ఎట్లు పనిచేస్తుందో తెలియజేసే ఉదాహరణగా ఈ క్రింది సంగతులను ఆలోచించండి. దేవుని నుండి వేరైన ఒక పాపి దేవుని వాక్యాన్ని విని, దేవుని కుమారుడుగా ఉండ టానికి తాను సృష్టింపబడెనని నేర్చుకుంటాడు. అయితే, అతడు అప్పటికి పాపానికి బానిస (గలతీ. 4.7). బైబిలు పఠనాన్ని కొనసాగించి, పాపం నుండి విమోచింపబడితే దేవుని కుమారుడు కావచ్చని అతడు నేర్చుకుంటాడు. అందుకే, అతడు పాప క్షమాపణ నిమిత్తం బాప్తిస్మము పొందుతాడు. తాను దేవునికుమారుడై ఉన్నాడని లేఖనాల ద్వారా అతడు ఎరుగుతాడు, తన సొంత ఆత్మ వాస్తవానికి సాక్ష్యమిస్తుంది. తాను సువార్తకు విధేయుడైనప్పుడు తనయొద్దకువచ్చిన పరిశుద్ధాత్మ కూడా తన ఆత్మతో సాక్ష్యమిస్తాడు (అపొ. కార్య. 2:38). దేవుని కుమారుడుగా తనగుర్తింపు సుస్థిరం చేసుకోవటానికి ఇది సహాయం చేస్తుంది. తన సాక్ష్యానికి పరిశుద్ధాత్ముడు బలము చేకూరుస్తాడు.

పరిశుద్ధాత్మ తన యొక్కసాక్ష్యమును వాక్యంద్వారా ఇస్తాడా? లేక వ్యక్తిగతము గానా? పరిశుద్ధాత్మ క్రైస్తవునితో నివసించుచున్నాడని జ్ఞాపకం చేసుకోండి. ఆయన ఒక వ్యక్తియై ఉన్నందున ఆయన వాక్యానికి వేరుగాకూడా పనిచేస్తాడు. మన ఆత్మతో ఆయన వ్యక్తిగతంగా సాక్ష్యమివ్వటం ఎందుకు నమ్మశక్యంకాని సంగతిగా అగుపిస్తుంది? ఒక వాస్తవాన్ని స్థాపించటానికి ఒక్కరి కంటే ఇద్దరు సాక్ష్యులు మేలు. అంతేకాదు గుర్తింపు ప్రక్రియలోకూడా ఇది బాగా పనిచేస్తుంది.

ఉదాహరణకు--సైకిలు త్రొక్కగలవాడు అను గుర్తింపు సాధించటానికి ఒక బాలుడు అనుసరించినప్రక్రియను ఆలోచించండి. తనక్రొత్తసైకిలును అతడు ఎక్క గలిగాడు, ఇప్పుడు అతడు తొలిసారిగా తనంతటతానుగా సీటుమీద కూర్చున్నాడు. అతడు నడుపుచున్నాడు. ఆహా! ఇపుడు అతడు సైకిలు త్రొక్కగలవాడు. వెంటనేఅతడు తన యొక్క క్రొత్త గుర్తింపును తన తల్లితండ్రులుగానీ,స్నేహితులుగానీ ఒప్పుకొనినా రోలేదో తెలిసికోవటానికి అతడు వారివైపే చూస్తాడు మెచ్చుకొన్నట్లు వారు తమ తలలను ఊపారనుకుందాం. అతడు తన మార్గంలోఉన్నాడు. ఇరుగుపొరుగు వారిమధ్య సైకిలు త్రొక్కువాడుగా తన గుర్తింపును కలిగి ఉన్నాడు. బాలుడు తనను గూర్చి తాను సాక్ష్యం పలికాడు. ఇతరులు కూడా తమ సాక్ష్యాన్ని చేర్చారు. రెండవ సాక్ష్యం తన గుర్తింపును సుస్థిరం చేయటానికి సహకరించినది.

అదే విధంగా, మనం దేవునికుమారులమని పరిశుద్ధాత్మ మన **ఆత్మతో కూడా సాక్ష్య మిస్తున్నాడు.** అయితే, ముందుగా మనకు మనం సాక్ష్యమిచ్చుకోవాలి. పరిశుద్ధపరచు కార్యక్రమంలో పరిశుద్ధాత్మ గుర్తింపు అత్యంత అవసరం. దేవుడు తన బిడ్డలను ఎరుగును. ఎందుకంటే, తన యొక్క ముద్రగా ఉండునట్లు పరిశుద్ధాత్మను ఆయన మనకు అనుగ్రహించాడు (2 కొరింథీ 1:22; ఎఫెసీ. 1:13). దేవుని కుమారు లమని మనలను మనం గుర్తించుకొనునప్పుడు ఆయనను మన మెరుగుదుము. మహిమా న్వితమైన ఈ పాత్రలో అట్లు గుర్తించుకొనుటలో సహాయం చేయటానికే దేవుడు మనకు పరిశుద్ధాత్మను అనుగ్రహించాడు.

విశ్వసించినవారికందరికీ పరిశుద్ధాత్మ అనుగ్రహింపబడ్డాడు. అయితే కొందరు ఆయన ఉనికిని ఆర్పి, ఆయనతోడి సహవాసంలోని మేలును పొందలేకపోతున్నారు. (అపొ. కార్య. 5:32; 1 థెస్స. 5:19), ఉదాహరణకు -ఒక దూర దేశానికి నీవు కారులో పోవుచుండగా నీకు తెలియని ఒకరు వెనుక సీటులో కూర్చుండినయెడల వారు అక్కడేవుండినా వారి సహవాసం యొక్క మేలును నీవేమీ పొందలేవు. క్రైస్తవులు కొందరి విషయంలో అలాగే వుంటుంది. విశ్వాసంగల క్రైస్తవులమైతే ఆయన మనతో ఉంటాడు. అయితే, ఆయన సహవాసాన్ని మనం అనుభవింపకపోవచ్చును. ఆయ నను మనం అలక్ష్యం చేయుటకంటే బలహీనమైంది, పరిశుద్ధాత్మను ఎక్కువగా దుఃఖ పరచేది మరేది లేదు (ఎఫెసీ. 4:30; 1 కొరింథీ. 6:15-20).

పరిశుద్ధాత్ముని ఉనికిని మనజీవితాల్లో ప్రత్యక్షంగా ఎరుగుట అత్యంత ముఖ్యము. ఆయన మనలో ఉన్నాడని ఒకమారు నమ్మితే ఆయనమనతో ఎల్లప్పుడు ఉంటాడని నమ్మగలం. ఆయన సహవాసం మనకు అవసరం. దుష్టసాంగత్యము మంచినడవడిని చెరుపుతుంది. అదేరీతిగా, మంచిసాంగత్యం మంచినడవడిని వృద్ధి చేస్తుంది. (1 కొరింథీ. 15:33). మనం గౌరవించే ప్రజల సహవాసంలో సక్రమంగా ప్రవర్తించటానికి ఎక్కువగా ప్రయత్నంచేస్తుంటాము. సాధారణంగా, తల్లిదండ్రుల సమక్షంలో పిల్లలు సక్రమమైనరీతిలో ప్రవర్తిస్తారు. పరిశుద్ధాత్ముడు మనలో ఉన్నాడనే జ్ఞాపకం ఎల్లప్పుడును మనకు మంచి సాంగత్యాన్ని ఇస్తుంది. పాపానికి అతీతంగా జీవించటానికి ఆయనసన్నిధి మనకు సహాయం చేస్తుంది. మన ఆంతర్యపురుషుడ్ని పరిశుద్ధాత్మ బలపరచే మరో మార్గమేమంటే మన స్వాస్థ్యానికి సంచకరువు. అనగా బజానాగా ఉండుటయే. అపొస్తులుడైన పౌలు ఎఫెసులోని క్రైస్తవులకు ఈ క్రింది లేఖనంలో చెప్పింది అదే.

> *మీరును సత్యవాక్యమును, అనగా మీరక్షణ, సువార్తను విని, క్రీస్తునందు విశ్వాస ముంచి, వాగ్దానము చేయబడిన ఆత్మచేత ముద్రించబడితిరి. దేవుని మహిమకు కీర్తి కలుగుటకై ఆయన సంపాదించుకొనిన ప్రజలకు విమోచనము కలుగు నిమిత్తము ఈ ఆత్మ మన స్వాస్థ్యమునకు సంచకరువుగా ఉన్నాడు.*
>
> *ఎఫెసీ 1:13,14*

మనకోసం మరలావస్తానని యేసు మనకు వాగ్దానం చేసాడు. ఆ దినాన మనం సమాధిలో నుండి బయటకు వస్తాము. ఒకవేళ, యేసు తిరిగివచ్చే సమయానికి మనం సజీవులుగా ఉండి ఉంటే మార్పుచెంది, మహిమశరీరాన్ని ధరించుకుంటాం. అప్పుడా యన తనయొక్కయు, తండ్రి యొక్కయు ఇంటకి మనల్ని తోడుకొనిపోతాడు (యోహాను. 14:1-3; 1 కొరింథీ. 15:42-44,51,52). ఇంతకంటే ఆశ్చర్యకరమైన దేమంటే ఆయన మనకు దేవునిరాజ్యం నిత్యజీవం అనే స్వాస్థ్యాన్ని వాగ్దానం చేసాడు (మత్తయి 19:29; 25:34). మన ఆత్మీయ జీవితానికి మూలాధారమైన నిరీక్షణమీదే అక్షరార్థంగా మన జీవితాలను కొనసాగిస్తాము. (రోమా 8:24,25). ఆ నిరీక్షణ కోసం దేవుడు మనకిచ్చిన సంచకరువు మనతో ఉండే పరిశుద్ధాత్ముని యొక్క ఉనికి అని గ్రహించుకొందాం. నాశనానికి లోనయిన సమస్త ధాస్యం నుండి మనం విడిపింపబడిన తరువాత ఎట్లుండుమో అనుదానికి సంబంధించిన దృక్పథాన్ని క్రైస్తవులమైన మనకు ఇది ఇస్తుంది. భ్రష్టత్వంలోనున్న లోకంలో మన భౌతిక దేహాలలో మనం ఉండగనే ఈదృక్పథం మన అనుదిన జీవితాల్లో ఎంతో ప్రభావాన్ని చూపిస్తుంది. భద్రత, క్షేమం మనకున్నవని మనమెరిగినయెడల, ఒకవేళ జీవితంలో తుఫానులు చెలరేగినా మనం వాటిని సంతో షంగా భరిస్తాము.

క్రైస్తవుల కోసం దేవుని సంచకరువుగా పనిచేసే పరిశుద్ధాత్మునియొక్క విలువను ఉదాహరించ టానికి మనం ఒక కథను ఆలోచించుదాం. అది అద్రిముత్తయ సముద్రం. ఊరకులోను అని సామాన్యంగా పిలవబడే భీకర తుఫానులో చిక్కుకుని ఒక ఓడ సముద్రంలో కొట్టుకొనిపోతూ ఉంది. ఓడలోని వారంతా బ్రతుకుమీద ఆశలు వదులు కున్నారు. ఆహారం భుజించటం విరమించుకున్నారు. అయితే, వారిమధ్య తననుతాను స్వాధీనమందుంచుకొనిన ఓవ్యక్తి ఉన్నాడు. ఈకష్టకాలంలో అతడు మిగిలినవారిని బలపరుస్తున్నాడు. ఆయనే అపొస్తలుడైనపౌలు. ఆయన ధైర్యానికి కారణం? చూడండి! అపొస్తలుడైన పౌలు తుఫాను ఆగిపోయిన తరువాత పరిస్థితులను గూర్చిన దృశ్యాన్ని దర్శనంలో చూసాడు. ఆ దర్శనం క్షేమాన్ని గూర్చిన నమ్మకాన్ని ఆయనకిచ్చింది(అపొ. కార్య. 27: 9-25). తుఫాను తరువాత క్షేమాన్నిగూర్చిన పౌలు దృక్పథం అతడు తుఫానులో చిక్కుకున్ననూ తనశీలాన్ని బలపరచింది మరియు అతనిని ఇతరులకు ప్రయోజనకరమైనవానిగా ఉండనిచ్చింది.

మనమిప్పుడు జీవిత తుఫానులో ఉన్నాము. జీవిత తుఫానులలో చిక్కుకున్నప్పుడు చాలా మంది నిరాశాపూరితులై, ఆందోళన చెంది తమకీ, ఇతరులకు హాని కలిగిస్తున్నారు. **మనయొక్క విమోచన, స్వాస్థ్యము అను వాటినిగూర్చిన దృక్పథం** ప్రస్తుత తుఫానులనుండి మనల్ని మేలుకరమైన మార్గంలో నడిపించునని యేసు ఎరుగును. "దేవుడు విమోచించిన ప్రజలమైనమనం" పరిశు ద్ధాత్ముణ్ణి పరిచర్యచేయటానికి అను మతించినప్పుడు శ్రమలనుకూడా ఆనందంగా భరిస్తామేమో ఎవరికి తెలుసు?

మృతుల పునరుత్థానంలో శ్రేష్ఠమైన దేహాన్ని అనుగ్రహించటానికి పరిశుద్ధాత్ముడు పనిచేయు చున్నాడని మనమెరిగినప్పుడు భౌతికమరణం ఒక ఆనందంకరమైన అంశం అవుతుంది. ఆయన మనలో నివసించటానికి మరోకారణం ఇదే. ఈక్రింది సందేశం ద్వారా మనం దానిని నేర్చుకుందాం.

*మృతులలోనుండి యేసును లేపినవాని ఆత్మ మీలో నివసించినయెడల, మృతులలో నుండి క్రీస్తుయేసును లేపినవాడు చావునకు లోనైన మీ శరీరమును కూడా మీలో నివసించుచున్న తన ఆత్మద్వారా జీవింప జేయును.*

*రోమా 8:11*

పరిశుద్ధాత్ముని పరిచర్య మొదటి శతాబ్దంలో ఎంత ఆవశ్యకమో, నేడునూ అంతే ఆవశ్యకం. వ్రాయబడిన సంపూర్ణసందేశాన్ని వారు పొందేంతవరకూ ఆరోగ్య కరమైన సంఘాన్ని క్రైస్తవులు కలిగి ఉండేందుకు ఆత్మసంబంధమైన వరములు సహాయం చేసాయి. వారి వ్యక్తిగత పెరుగుదలకు పరిశుద్ధాత్మునిసన్నిధి ఆవశ్యకం. నేడు పరిశుద్ధాత్మ నుండి వచ్చిన వాక్యమును మనము కలిగి యున్నాము; అయినప్పటికి మన అంతర్య పురుషుని బలపరుచుటకు మనకు ఆయన సహవాసం అవసరం,క్రీస్తు శరీరం యొక్క ఆత్మీయ ఆరోగ్యం మన ఆత్మీయ పరిపక్వత పై ఆధారపడి ఉంది. పరిశుద్ధపరచబడు కార్యము కొరకు మనకివ్వబడిన పరిశుద్ధాత్మ ద్వారా వాస్తవముగా దేవుని ప్రేమ మన హృదయములలో కుమ్మరించబడినది (రోమా. 5:5). ఆయన మనల్నివాక్యం ద్వారా నడిపిస్తాడు. అయితే మన ప్రార్థనాజీవితంలో మనకోసం విజ్ఞాపన చేయుటద్వారా మన తండ్రితో సరియైన ఉత్తరప్రత్యుత్తరాలు కలిగి ఉండే టట్లు వ్యక్తిగతంగా ఆయన సహాయం చేస్తాడు. దేవునికుమారులమనే గుర్తింపు ప్రక్రియలో మనలను బలపరుస్తాడు. మంచి సహవాసం అందిస్తాడు. తుదకు మన స్వాస్థ్యమునకు సంచకరువుగా పనిచేస్తాడు.

*కాగా మీరు పరిశుద్ధాత్మ శక్తి పొంది,విస్తారముగా నిరీక్షణ గలవారగుటకు నిరీక్షణ కర్తయగు దేవుడు విశ్వాసముద్వారా సమస్తానందముతోను సమాధానముతోను మిమ్మును నింపునుగాక.*

*రోమా 15:13*

## చర్చ కోసం ప్రశ్నలు

1. మొదటి శతాబ్ధంలో పరిశుద్ధాత్ముని పరిచర్య ఫలితంగా నేడు మనము కలిగి ఉన్న దేమిటి?
2. పరిశుద్ధాత్మ వరములను ఇంకను పొందుచున్నామని చెప్పే ప్రజలను గుర్తించు విధమేది?
3. ఆత్మ సంబంధమైన వరముల ఫలితంగా సంఘాలు కలిగి ఉన్నదాని కంటే నేడు మరింత సంపూర్ణ సందేశాన్ని మనకిచ్చునదేమి?
4. స్వస్థపరుచు కృపావరానికీ, రోగులకోసం మనం చేసే ప్రార్థనను దేవుడు అంగీ కరించు దానికిని తేడా ఏమి?

5. బైబిలుకు చేర్చటానికి ఈనాడు ప్రజలింకా సందేశాన్ని పొందుచుండినయెడల గడిచిన 2000 సంవత్సరములు కాలమంతటిలో సంఘము యొక్క స్థితి ఎట్లుంటుంది?
6. క్రీస్తు సంఘంలో నేటికీ పరిశుద్ధాత్ముడు పాత్ర కలిగిఉన్నాడా? ఉంటే అది ఏమిటి?
7. అన్యజనుల నిమిత్తమై పరిశుద్ధాత్ముని గూర్చిన వాగ్దానం చరిత్రలో ఎంతముందుగా వ్రాయబడింది?
8. క్రైస్తవులు పరిశుద్ధాత్మను పొందక పూర్వం ఏమి జరగవలసి ఉంది?
9. క్రైస్తవయుగాన్ని పరిశుద్ధాత్మ పరిచర్య యుగం అని ఏల పిలువవచ్చు?
10. క్రైస్తవుడు ఆత్మఫలాన్ని తనజీవితంలో కలిగి ఉండినప్పుడు అతని లక్షణాలు ఎలా ఉంటాయి?
11 మనల్ని పరిశుద్ధపరచు కార్యక్రమంలో పరిశుద్ధాత్ముడు ఉపయోగించు ఓ సాధనం ఏది?
12. పరిశుద్ధాత్ముడు వాక్యం ద్వారా క్రైస్తవులతో పనిచేయలేని ఒక విధానం తెలపండి.
13. క్రైస్తవునిలో నివసించుచు, పరిశుద్ధాత్ముడు చేయు వేరు వేరు పనులను వరుసగా వ్రాయండి.
14. దేవునితో మన ఉత్తర ప్రత్యుత్తరాలను జరుపుకొనుటలో పరిశుద్ధాత్ముడే సరియైన వ్యక్తియని ఎందుకు తలంచవలెను?
15. ఉత్తరప్రత్యుత్తరాలు లేకపోతే అది జీవితంలో మనస్థానాన్ని ఎట్లు బలహీన పరుస్తుంది?
16. దేవునికుమారుడుగా క్రైస్తవుడు పొందు గుర్తింపుకు ప్రక్రియ ఏది?
17. జీవితంలో మన ఉద్దేశానికీ మనగుర్తింపుకు గల సంబంధమేమి?
18. అబద్ధమాడుట అను పాపంనుండి క్రైస్తవుడు దూరంకావటానికి దేవునికుమారుడు అనే గుర్తింపు ఎట్లు సహాయం చేస్తుంది?
19. పరిశుద్ధాత్ముడు మనలో నివసించుచున్నాడని మనకెట్లు తెలుస్తున్నది?
20. దేవుని కుమారుడు అవటానికీ, దేవునికుమారుడు అనే గుర్తింపు పొందటానికీ మధ్యగల భేద మేమిటి?